ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

16

బుధవారం 3 జనవరి 2018

మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 32 । కనిష్ఠం 16



నేడు, రేపు సీపీఎం
జిల్లా మహాసభలు

- భద్రాచలంలో సమావేశాలు
- హాజరవనున్న తమ్మినేని

3





గోవిందమండపంలో రామయ్యకు రాపత్తు సేవ దృశ్యం

రామయ్యకు.. రాపత్తుసేవ

- కన్నులపండువగా వేడుక

16

అడవి హాంఫట్

- అన్యాక్రాంతమవుతున్న అటవీ భూమి
- ఇప్పటికే కొత్తగూడెం, పాల్వంచ డివిజన్లలో 8వేల హెక్టార్లు కనుమరుగు
- 1,688కేసులు.. 7,508 మంది నిందితులు
- కొందరికి వరంలా 'చట్టం'
- అడవుల ఆక్రమణకు ఎన్నో కారణాలు
- 'ఎన్‌జీఎస్' హెచ్చరికలతో దిద్దుబాటు చర్యల్లో అధికారులు





ప్రాంతం	ఆక్రమణగురైన హెక్టార్లు	కేసులు	నిందితులు
కొత్తగూడెం	3,239	551	2,722 మంది
పాల్వంచ	3,415	607	3,566 మంది
పాల్వంచ (వన్యప్రాణి)	2,919	530	1,220 మంది
మొత్తం	9,573	1,688	7,508 మంది

14

ఒకప్పుడు పచ్చని చెట్లు.. పక్షుల కిలకిలారావాలు.. వన్యప్రాణుల అడుగుజాడలతో అలరారిన అటవీ ప్రాంతం నేడు కళావిహీనంగా మారింది. పోడు భూములు, చెట్ల మోడులతో దర్శనమిస్తోంది. అటవీ హక్కుల చట్టాన్ని చుట్టంగా మలుచుకున్న 'కొందరి' అకృత్యాల కారణంగా.. అడవుల విస్తీర్ణంలో ఒకప్పుడు అగ్రభాగంలో ఉన్న ఉమ్మడి జిల్లా ఇప్పుడు ఆ స్థానాన్ని కోల్పోయి.. విధ్వంసం జాబితాలోకి చేరింది. అటవీశాఖ అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్య వైఖరే దీనంతటికీ కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అడవుల ఆక్రమణ, విధ్వంసం ఏ మేరకు జరిగిందో... నేషనల్ జియో గ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఎన్‌జీఎస్) వారు తెలియజేసే వరకు అటవీ శాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. చివరకు ఎన్‌జీఎస్ హెచ్చరికతో మేల్కొన్న ఆ శాఖ అధికారులు 'హద్దులు' సరిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.

– ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం



ఖమ్మంలో..
ఫోరెన్సిక్ ల్యాబ్

- మూడు విభాగాల ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.50 లక్షలు కేటాయించిన ప్రభుత్వం
- ల్యాబ్‌లో ఎస్పీ, ఏఎస్పీ కేడర్ అధికారి
- స్థలం వెతికే పనిలో అధికారులు
- అతితక్కువ సమయంలో నేరాల పరిశోధనకు అవకాశం

సెంటర్‌స్ప్రెడ్‌లో

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



భద్రాచలం సబ్‌కలెక్టర్‌గా పమేలా సత్పతి

2013 తర్వాత ఐఏఎస్ అధికారికి మళ్లీ బాధ్యతలు

14

విచ్చలవిడిగా వేట

విద్యుత్ వైర్లు, ఉచ్చులు, నాటుతుపాకులతో వధ

ప్రమాదవశాత్తు మనుషులు, పశువులూ మృతి

6

జీవోటీ, ఈవోటీ ఉత్తీర్ణులైతేనే 24ఏళ్ల స్కేలు

బోనకల్, జనవరి 2: సెకండరీ గ్రేడు టీచర్లుగా పనిచేస్తున్న వారు 24సంవత్సరాల స్కేలు పొందడానికి గాను తప్పనిసరిగా డిపార్టుమెంటు పరీక్షలయిన జీవోటీ, ఈవోటీలలో ఉత్తీర్ణతపొంది ఉండాలని జీ.వో ఎంఎస్ నెం.93, తేదీ. 3-4-2010ప్రకారం స్పష్టం చేశారు. ఎస్‌జీటీలు 50సంవత్సరాలు దాటినప్పటికి ఈ స్కేలు పొందడానికి మాత్రం డిపార్టుమెంట్ పరీక్షలు పాసవ్వాలి. స్కూల్ అసిస్టెంట్‌లు కూడా 12సంవత్సరాల ప్రమోషన్ స్కేలు పొందడానికి ఈవోటీ, జీవోటీ పరీక్షలు ఉత్తీర్ణత పొందాలి. పాఠశాలల్లో త్రీఆర్స్ అమలు తీరుపై రాష్ట్ర పర్యవేక్షక బృందాలు ఈ నెల3 నుంచి 9వరకు పరిశీలించే విధంగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆర్‌సీనెం.471, తేదీ. 29-12-2017 ద్వారా తగు ఉత్తర్వులు జారీ చేయడంతో ఉపాధ్యాయులు రికార్డులు సిద్ధం చేసుకోనే పనిలో నిమగ్నమయ్యారు. ప్రారంభ, తుది పరీక్షలలో వచ్చిన మార్కులతో పాటు పాఠశాలల్లో రికార్డులను పకడ్బందీగా సిద్ధం చేస్తున్నారు.



ప్రశాంత జీవనానికి పంచక్రియలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 2: జీవితం ప్రశాంతంగా, ఆనందంగా సాగిపోవాలనే ప్రతి ఒక్కరు కోరుకుంటారు. ఆలాంటి జీవితాన్ని ఆదర్శవంతంగా కొనసాగించడానికి పంచక్రియలను అనుసరించాలని శాస్త్రం చెబుతోంది. ఉపాసన, ఉత్సవం, అహింస, తీర్థయాత్ర, సంస్కరం అనేవి పంచక్రియలు. నియమ నిష్ఠలను పాటిస్తూ సంప్రదాయాన్ని గౌరవిస్తూ అనుదినం భగవంతుడిని ఆరాధించాలని 'ఉపాసన' చెబుతోంది. చక్కని కుటుంబ వాతావరణాన్ని కలిగి ఉండి, పండుగ సందర్భాల్లో జరిగే వేడుకల్లోను, దైవ సంబంధమైన ఉత్సవాల్లోను భక్తితో పాల్గొనాలని 'ఉత్సవం' స్పష్టం చేస్తోంది. ఇక ఇతరులకు ఏ విధంగాను కష్టాన్ని కలిగించకుండా, ఎలాంటి కారణం చేతను వాళ్లను హింసించకుండా నడుచుకోవాలని 'అహింసా' విధానం తెలియజేస్తుంది. బరువు బాధ్యతల పేరుతో భగవంఉడిని దర్శించడం, సేవించడం మరిచిపోకూడదని చెప్పడానికే 'తీర్థయాత్రలు' ఉద్దేశించారు. ఇక పుట్టుక నుంచి మరణం వరకూ ఆచార వ్యవహారాల పేరుతో పూర్వీకుల నుంచి సంక్రమించిన పద్ధతులను పాటిచడమే 'సంస్కారం.'



నా లక్ష్యం ఐఏఎస్..

8 కడారి ప్రసాద్, ఎస్ఐ , చంద్రుగొండ

● చంద్రుగొండ



చదువుల్లో అత్యంత ప్రతిభ కనబర్చి ఉపాధ్యాయ వృత్తిలో రాణించాడా యువకుడు. సమాజ సేవ చేయాలని తపించాడు. తన కల సాకారం కావడానికి పోలీస్ శాఖనే వేదికగా చేసుకోవానుకున్నాడు. దీక్షతో ఎస్ఐగా ఉద్యోగం సాధించాడు. ఆయనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ ఎస్ఐ కడారి ప్రసాద్. 'ఆంధ్రజ్యోతి' ఆత్మీయంగా పలకరించగా పలు విషయాలను పంచుకున్నారు. ఆ సంగతులు ఆయన మాటల్లోనే...

కుటుంబ నేపథ్యం

మాది కరీంనగర్ జిల్లాలోని కోహెడ మండలకేంద్రం. నాన్న కడారి జార్జి, అమ్మ స్వరూపారాణి. మొత్తం ఐదుగురు సంతానంలో నేనే పెద్దోడిని. ఇద్దరు చెల్లెల్లు, ఇద్దరు తమ్ముళ్లున్నారు. నాన్న జైలు సూపరింటెండెంట్‌గా రిటైరయ్యారు.

విద్యార్హతలు

కరీంనగర్‌లో ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ వరకు చదివా. కాకతీయ వర్సిటీ క్యాంపస్‌లో పీజీ (ఎమ్మెస్సీ జువాలజీ) పూర్తిచేశా. చదువుల్లో మొదటి తరగతి నుంచి నాది ఫస్ట్ ర్యాంకే. పీజీ అనంతరం ప్రైవేట్ కళాశాలలో కొంత కాలం లెక్చరర్‌గా బోధించా. అనంతరం 2010లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. 2012లో ఎస్ఐ పరీక్షలు రాసి ఉద్యోగం సాధించా. ఆరు నెలలు ప్రొహిబిషనరీగా పనిచేసి ఖమ్మం జిల్లాలోని ముదిగొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెంలో పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టా.

అలవాట్లు.

నాకు పుస్తకాలు చదవడం ఎంతో ఇష్టం. పాఠశాల, కళాశాల స్థాయిలో పుస్తకాలు ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ లాంటి పోటీల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. విశ్వవిద్యాలయ స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీల్లో, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించా.

కలెక్టర్‌నవుతా..

గ్రూప్స్ సివిల్స్ రాస్తూ... ఐఏఎస్ సాధించాలనేది నా ప్రధాన లక్ష్యం. సమాజ సేవ, గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేసి అభివృద్ధికి పాటుపడాలనేది నా కోరిక. పేద విద్యార్థులకు చదువు చెప్పడం, పాఠశాల, కళాశాల విద్యార్థులకు సమాజంపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం. దీనికోసం యువత ముందుకు రావాలి. పల్లెల్లోని యువత భావిభారతం కోసం కృషిచేయాలి. తమతో పాటు స్నేహితులను ప్రోత్సహించి విజయంసాధించాలి.

కరాటేలో దూసుకుపోతున్న కటారి మేఘన

అంతర్జాతీయ పోటీలకు అర్హత

ఐపీఎస్ సాధించాలనే లక్ష్యం

బరిలోకి దిగితే విజయం తనదే

పట్టుమని పదేళ్లు కూడా నిండని చిన్నారి కరాటేలో రాటుదేలింది. మెరుపువేగంతో దాడి చేసి ప్రత్యర్థిని మట్టి కరిపిస్తోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల చిన్నారి కటారి మేఘన కరాటేలో ప్రతిభ కనబరుస్తోంది. అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఈ బుల్లి కరాటే ఫైటర్‌పై ప్రత్యేక కథనం..

● సత్తుపల్లి రూరల్

చిచ్చర పిడుగు



మేఘన

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామానికి చెందిన కటారి రాము, శైలజ దంపతుల ఏకైక కుమార్తె మేఘన. ఆడపిల్ల కావడంతో తండ్రి రాము ఆత్మరక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇప్పించారు. నాలుగు నెలల క్రితం పెనుబల్లికి చెందిన కరాటే శిక్షకుడు శ్రీకాంత్ వద్ద చేర్పించారు. మొదటి వారంలోనే శిక్షణలో ప్రతిభ కనబర్చడంతో శ్రీకాంత్ మేఘనపై ప్రత్యేక దృష్టి సారించి మెలుకువలను నేర్పించారు. అతి తక్కువ కాలంలో వివిధ కరాటే పోటీల్లో పాల్గొని బంగారం, వెండి పతకాలను సొంతం చేసుకుంది.





కుటుంబ నేపథ్యం

మేఘన పెనుబల్లి మండలం ఏరుగట్ల గ్రామంలోని నిరుపేద కుటుంబంలో జన్మించింది. తండ్రి కటారి రాము ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి శైలజ వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నారు. ఒక్కతే కూతురు కావడంతో తనను బాగా చదివించాలని నిర్ణంచి తాము కష్టపడి మేఘనను ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. ప్రతి రోజు తండ్రి ఆటో తోలుకునేందుకు వెళ్లేటప్పుడు తనతో పాటు మేఘనను పెనుబల్లికి తీసుకువెళ్లి కరాటే మాస్టర్ శ్రీకాంత్ వద్ద ప్రత్యేక శిక్షణ ఇప్పించేవారు.

స్కూల్ యాజమాన్యం చేయూత

మేఘన ప్రతిభను గుర్తించిన సత్తుపల్లి మిలీనియం పాఠశాల యాజమాన్యం పదో తరగతి వరకు చిన్నారి మేఘనకు తమ పాఠశాలలో 50శాతం ఫీజు రాయితీ ఇస్తామన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.చంద్రకళ చిన్న వయసులోనే అత్యంత ప్రతిభ కనభరిస్తున్న మేఘనను అభినందించారు. తమ ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని హామీ ఇచ్చారు.

ఐపీఎస్ చేయాలన్నదే నా కల
- కటారి రాము, తండ్రి




నా కూతుర్ని ఐపీఎస్‌గా చూడలన్నదే నా లక్ష్యం. చదువు, కరాటేలో ప్రతిభ కనభరచడం చాలా సంతోషంగా ఉంది.

చురుకైన అమ్మాయి
శ్రీకాంత్, కరాటే మాస్టర్



మేఘనకు ఒకసారి చెప్పితే చాలు కరాటే మేళుకువల్ని వెంటనే నేర్చుకుంటుంది. నేను నా 15ఏళ్ల శిక్షణలో మేఘన లాంటి వండర్ కిడ్‌ను చూడలేదు. మున్ముందు ఎన్నో పతకాలు సాధించి పెట్టి తన గురువైన నాకు మంచి పేరు తీసుకోస్తుందని నా నమ్మకం.

ఫీజు రాయితీ ఇస్తాం
పోట్రు నాగేశ్వరరావు, కరస్పాండెంట్



మేఘన కరాటేలో చూపించిన ప్రతిభను అభినందిస్తూ పదో తరగతి వరకు ఫీజులో రాయితీ ఇవ్వాలని నిర్ణయించాం.



శిక్షణ పొందుతున్న మేఘన

మూడు నెలల్లోనే ఎన్నో పతకాలు

శిక్షణలో చేరిన మూడు నెలల్లోనే వివిధ రాష్ట్రాల్లో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలను సాధించింది. ఈ ఏడాది టైగర్ కరాటే అసోసియేషన్ పెనుబల్లిలోని సప్తపది ఆడిటోరియంలో నిర్వహించిన ద్వితీయ నేషనల్ కరాటే పోటీల్లో పాల్గొని (కటా విభాగంలో) ద్వితీయ స్థానంలో నిలిచింది. గోవాలో జరిగిన ఆల్ ఇండియా డబ్ల్యూఎఫ్ఎస్‌కేవో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని కటా, కుమిట్ విభాగాల్లో బంగారు, వెండి పతకాలను సాధించింది. సందేశ్ కరాటే అకాడమీ ఖమ్మంలో నిర్వహించిన నాలుగో అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలను సాధించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ముంబైలో జరిగే డబ్ల్యూఎఫ్ఎస్‌కేవో అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించింది.

భూసేకరణ వేగిరం చేయండి

జిల్లా కలెక్టర్లతో

ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి2: సీతారామ ప్రాజెక్ట్ పథకం అమలు వేగవంతం చేసేందుకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్‌కే. జోషి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో సీతారామ ప్రాజెక్ట్ భూసేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 31జిల్లాల కలెక్టర్లతో జిల్లాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు కావలసిన నిధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మాట్లాడుతూ... భూసేకరణపై నివేదించారు. సీతారామ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతంగా జరుగుతుందన్నారు. భూసేకరణలో నిర్వాసితులకు ప్రస్తుతం రూ.17కోట్లు నిధులు చెల్లించాల్సి ఉందని, మరో రూ.50కోట్లు చెల్లించాల్సి ఉందని వివరించారు. జిల్లా ఇంజనీరింగ్ అండ్ చీఫ్ సుధాకర్ మాట్లాడుతూరూ.150కోట్లతో పనులు చేపట్టామని, ఎనిమిది ప్యాకేజీలుగా తీసుకొని నాలుగుప్యాకేజీ పనులను ప్రారంభించామని ఆయన వివరించారు. అటవీశాఖ అనుమతులు రాగానే పనులు వేగవంతంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. భూసేకరణ వివరాలు గ్రామస్థాయిలో తెలిసేలా ప్రకటనలు ఇవ్వాలన్నారు. మార్చి 31తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలు నెరవేర్చేందుకు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. రాంకిషన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ అండ్ సర్వే ఏడీ సుకుమ కుమారి, సీతారామ ప్రాజెక్ట్ ఈఈ బాబురావు పాల్గొన్నారు.

నివేదికలను త్వరగా ఇవ్వాలి

జిల్లాలో వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నివేదికను త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జనవరి 26న నిర్వహించే గణతంత్ర వేడుకల్లో జిల్లా పురోగాభివృద్ధిని ప్రసంగించనున్న నేపథ్యంలో అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అందజేయాలని ఆయన తెలిపారు. మంగళవారం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. 2017 ఏప్రిల్ నెల నుంచి 2017 డిసెంబర్ 31వరకు వివిధ శాఖలు అమలుచేసిన అభివృద్ధి పథకాలను ఒక పేజీకి మించకుండా, 10తేదీలోపు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారికి అందజేయాలని సూచించారు.

రేపు జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు

చుంచుపల్లి, జనవరి2: జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలను గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ జయశంకర్‌మైదానంలో ఉదయం నుంచి ఈ ఎంపికలను నిర్వహిస్తున్నామన్నారు. బాల బాలికలకు అండర్-10 విభాగంలో 60మీటర్లు, 200, 600మీటర్లు లాంగ్‌జంప్, 4ఇంటు50 రిలే, అండర్-12 విభాగంలో 80, 300, 600 మీటర్లు లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, 4ఇంటు100, అండర్-14 విభాగంలో 100,200, 400 మీటర్ల రిలే, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, అంశాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణపత్రాలను సకాలంలో తీసుకురావాలని కోరారు. ఎంపికైన వారు ఈనెల8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆ ప్రకటనలో చెప్పారు.

పాల్వంచ మునిసిపల్ కమిషనర్‌గా షఫీ ఉల్లా



పాల్వంచటౌన్, జనవరి 2: పాల్వంచ ఇన్‌చార్జ్ మునిసిపల్ కమిషనర్‌గా షఫీఉల్లా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత కమిషనర్ భాస్కర్ గౌడ్ పదవీ విరమణతో ఈ ఖాళీ ఏర్పడింది. ప్రభుత్వ ఆదేశాలతో కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పాల్వంచ బాధ్యతలను చేపట్టారు.

ఆ నలుగురు శిశువులు క్షేమం

20 రోజుల క్రితం భద్రాచలంలో

ఒకే కాన్పులో జననం

వైద్యుల పర్యవేక్షణలో చిన్నారులు..



వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి2: భద్రాచలంలో ఓ గిరిజన మహిళకు 20రోజులక్రితం నలుగురు శిశువులు జన్మించారు. జీవన్ ఆసుపత్రిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పండా కామేకు జన్మించిన ఈ శిశువులు ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు. మంగళవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.స్పందన, డా. శివ రామకృష్ణ ప్రసాద్ ఈ వివరాలు వెల్లడించారు. భద్రాచలంలో ఈనెల 13న కామేకు ప్రసవంలో నలుగురు పిల్లలు జన్మించారు. వీరు బరువు తక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం జాబిల్లి వైద్యశాలకు చెందిన డా. మోపర్తి సురేష్‌బాబుతో మాట్లాడారు. నిరుపేద మహిళ కావటంతో ఉచిత చికిత్స అందించేందుకు ఒప్పించారు. ఈ విధంగా ఉమ్మడిరాష్ట్రంలో ఒకే కాన్పులో జన్మించిన నలుగురు శిశువులు బతకడం ఇదే తొలిసారి అని వారు పేర్కొన్నారు. ఈ వైద్యం అందించాలంటే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఖర్చవుతుందని, డా.సురేష్‌బాబు మానవతా దృక్పథంతో ఉచితంగా అందించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లలకు తదుపరి వైద్య చికిత్స నిమిత్తం భద్రాచలం ఎన్ఆర్‌సీ కేంద్రంలో చేర్పిస్తామని పేర్కొన్నారు. అరుదైన శస్త్రచికిత్స నిర్వహించిన డా. స్పందన దంపతులను భద్రాచలం తహసీల్దారు రామకృష్ణ సన్మానించారు.

లబ్ధిదారులకు నేరుగా సరుకులు

ఈ-పాస్ మిషన్‌ను ప్రారంభించిన జేసీ



ఈ-పాస్ మిషన్‌ను ప్రారంభిస్తున్న జేసీ

కొత్తగూడెంకలెక్టరేట్, జనవరి2: ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా అమలు చేయడంతోపాటు లబ్ధిదారులకు నేరుగా సరకును చేరవేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ-పాస్ విధానాన్ని చేపట్టిందని జాయింట్ కలెక్టర్ ఎం.రాంకిషన్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం రైటర్‌బస్తీ గొల్లగూడెంలో చౌకదుకాణంలో ఈ-పాస్ మిషన్ అమలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేద న్నారు. దీంతో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేవి కావని, అలాంటి లోపాలను పునరావృతం కాకుండా పారదర్శకంగా నిత్యావసర సరుకులు ఖచ్చితమైన లబ్ధిదార్లకు చేరే విధంగా ఈ విధానం తోడ్పడుతుందన్నారు. ప్రజలు ఈ విధానాన్ని అమలుచేసుకొని లబ్ధిపొందాలని ఆయన కోరారు. కుటుంబ సభ్యుల్లో ఏవరైనా ఈ మిషన్ ద్వారా రేషన్ తీసుకునే వీలుందన్నారు. సిగ్నల్స్ రాని ప్రాంతాల్లో కొన్ని రోజులు పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.అనంతరం వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని జేసీ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ అమృతరెడ్డి, డీటీలు భగవాన్‌రెడ్డి, శివ కుమార్, కిషోర్, డీలర్ మంగమ్మ పాల్గొన్నారు.

నేడు, రేపు సీపీఎం జిల్లా మహాసభలు

హాజరు కానున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

భద్రాచలం, జనవరి 2: సీపీఎం జిల్లా మహాసభలు బుధవారంనుంచి ప్రారంభం కానున్నాయి. భద్రాచలంలోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్లో రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రా ష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావు, బి.వెంకట్, జిల్లా కార్యదర్శి కాసాని ఐలయ్యతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో జిల్లా వ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు సున్నం రాజయ్య, డా. జివివి సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, బి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పార్టీ సీనియర్ నాయకుడు కుంజాబొజ్జి జెండా ఆవిష్కరణ చేస్తారని, అనంతరం సభ ప్రారంభం అవుతుందన్నారు. ఈమహాసభల్లో ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజల పట్ల అనుసరిస్తున్న విధానాలు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, పోరాటాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అంశాలు విధిస్తున్న తీరుపై చర్చించనున్నారు. ఈ సమావేశాలకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

పినపాక

పినపాక - మణుగూరు- బూర్గంపాడు
అశ్వాపురం- కరకగూడెం- గుండాల - ఆళ్లపల్లి

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి: ఎంపీపీ

కరకగూడెం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని ఎంపీపీ అధ్యక్షురాలు కొమరం సమ్మక్క సూచించారు. మంగళవారం చిరుమళ్ల, రాయనిపేట గ్రామాల్లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి.. మాట్లాడారు. పశువులకు ముందు జాగ్రత్తగా వ్యాధి నివారణ కోసం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంటు రామ్మోహన్, సోయం శ్రీను, సునీల్ పాల్గొన్నారు.

సినిమాలు

మణుగూరు

- సత్యభాస్కర హాలో
- సీతారామ ఎంసీప

పినపాక మండల అధికారుల సమాచారం

తహసీల్దార్:9652528386
ఎంపీడీవో : 9440906951
ఎంఈవో : 9959087110
సీఐ బయ్యారం : 9440795328
ఎస్‌ఐ, కరకగూడెం:9440904284
ఎస్‌ఐ బయ్యారం:9440904283
రేంజి అధికారి : 9440816277
విద్యుత్ ఏడీఈ : 9440811536
వెలుగు ఏపీఎం : 9704789715
సీడీపీవో : 7095556826
పీఆర్ ఏఈ : 9959156956
ఇరిగేషన్ ఏఈ : 9652177622
ఐటీడీఏ ఏఈ : 8142574999
వ్యవసాయాధికారి : 72888942

అక్రమానికి..
అడ్డేదీ..?

పెద్దవాగు నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా

లక్షలు దండుకుంటున్న అక్రమార్కులు


పెద్దవాగులో ఇసుక లోడుచేస్తున్న దృశ్యం

కరకగూడెం: మండలంలోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా సాగుతోంది. యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తూ.. అక్రమార్కులు లక్షల్లో సంపాదిస్తున్నారు. భారీగా ట్రాక్టర్లు సంచరిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. రాత్రీ పగలు తేడా లేకుండా అక్రమార్కులు ఇసుక రవాణా చేస్తున్నా.. చర్యలు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. మండల కేంద్రం నుంచి ట్రాక్టర్లు వెళుతున్నా.. అధికారులకు పట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. గతంలో మిషన్ భగీరథ, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం మంజూరు చేసిన అనుమతి పత్రాలను ఇప్పుడూ చూపిస్తూ.. అక్రమానికి పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రుళ్లు ట్రాక్టర్లపై డెక్కులు ఏర్పాటు చేసి.. పెద్ద పెద్ద సౌండ్‌లు పెట్టి.. తమను ఇబ్బందుల పాల్జేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇంత బహిరంగంగా అక్రమం సాగుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడానికి అధికారుల అండ చూసుకునే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

సమాచారం లేదు
అనీల్‌కుమార్, తహసీల్దార్

భూ ప్రక్షాలన పనులు ఉండటం వలన కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదు. పెద్దవాగు నుంచి రాత్రి పగలు ఇసుక రవాణ జరుగుతున్న విషయమై సమాచారం లేదు. ఇసుక రవాణా చేస్తే.. ట్రాక్టర్లు సీజ్ చేస్తాము.

పాఠశాలల ఫీజులపై
నియంత్రణ ఉండాలి

మణుగూరురూరల్, జనవరి2: కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని పలువురు సూచిస్తున్నారు. అసలే ఫీజుల భారంతో తల్లి దండ్రులు ఇబ్బంది పడుతుండగా.. ప్రభుత్వం నియమించిన తిరుపతి రావు కమిటీ ఏకంగా ప్రవేట్ పాఠశాలలు పదిశాతం ఫీజు పెంచవచ్చునని నివేదిక ఇవ్వడం సరి కాదని వివిధ వర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రజాగళం



ఇది సరికాదు
సింగా రవి, ఏటీఏ నాయకుడు..



ప్రైవేటు పాఠశాలల ఫీజులను నియంత్రించాలనే డిమాండ్ ఉన్నా.. పదిశాతం పెంచుకోవచ్చని కమిటీ నివేదికను ఇవ్వడం సరికాదు. పేరు ప్రఖ్యాతులకోసం ఇబ్బడి ముబ్బడిగా ప్రారంభించిన గురుకుల పాఠశాలల వలన ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా పడిపోయాయి. కమిటీ నివేదిక, ప్రభుత్వ చర్యలు చూస్తే పరోక్షంగా ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తోంది.

గ్రేడింగ్ చేయాలి
షరీఫ్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం నేత



తొలుత కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను వాటి స్థాయినిబట్టి గ్రేడింగ్ చేయాలి. ఆ తరువాత పట్టణ, గ్రామీణ ప్రాంతాలనూ విభజించాలి. తిరుపతిరావు కమిటీ ఇచ్చిన నివేదిక ఆచరణలో కష్టసాధ్యం. కార్పొరేట్ పాఠశాలలో కల్పించే సౌకర్యాలకు ఆ ఫీజు సరిపోదు. ప్రభుత్వం పాఠశాలలపై కచ్చితమైన నియంత్రణ సాధించినప్పుడే ఏ నివేదికైనా అమలవుతుంది.

మధ్య తరగతి వారికి కష్టమే
రఫీ, ప్రైవేట్ ఉద్యోగి..



మధ్యతరగతి కుటుంబాల ప్రజలకు తమ పిల్లలను ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో చదివిపించాలనుకోవడం తీరని కలగానే మిగులుతుంది. తిరుపతిరావు కమిటీ పదిశాతం పెంచమంటే కార్పొరేట్ సంస్థలు వందశాతం పెంచి చూపిస్తాయి. ఇదే నివేదికను చూపించి.. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు ఫీజులను పెంచే ప్రమాదం ఉంది.

నియంత్రణ ఉండాలి
మల్లికార్జునరావు, వ్యాపారి



కనీస సదుపాయాలు, అర్హతగల ఉపాధ్యాయులు లేని ప్రైవేటు పాఠశాలలు వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఫీజులకు తగ్గట్టుగా పాఠశాలల్లో సదుపాయాలు, నాణ్యమైన విద్య, అర్హతకలిగిన ఉపాధ్యాయులున్నారా అని ప్రభుత్వం పర్యవేక్షించాలి. ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటేనే ఫీజులపై నియంత్రణ ఉంటుంది. తిరుపతిరావు కమిటీ నివేదికను పక్కన పెట్టి ఫీజులను నియంత్రించాలి.

వైభవంగా మహాపడిపూజ

మణుగూరురూరల్, జనవరి2: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలోని కేతమల్ల రమణయ్య గృహంలో అయ్యప్ప స్వామి మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణుగూరు నీలకంఠేశ్వరస్వామి ఆలయ పీటం గురుస్వామి యాకయ్య పూజ నిర్వహంచగా అయ్యప్ప మాలాధారులు పుసులూరి శ్రీనివాస్, కామాద్రి ప్రశాంత్‌కుమార్, తనుగుల శ్రీనివాస్, చిర్ర శ్రీనివాస్, టీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొని స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యేపాయం

‘జాగృతి’ ఆధ్వర్యంలో ‘నూతన’ వేడుకలు

మణుగూరు, జనవరి2: సంతోష్‌నగర్ బాలవెలుగు పాఠశాలలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. తొలుత న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేసి పిల్లలకు పంపిణీ చేశారు. చిన్నారులు ఆనందోత్సాహాలతో గడిపారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా కన్వీనర్ బానోతు పవన్‌నాయక్, మురళీమోహన్, ఉపాధ్యాయులు చిట్టిబాబు, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ప్రదర్శన


ప్రదర్శన దృశ్యం

పినపాక, జనవరి2: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాలు మంగళవారం పినపాకలో వినూత్నంగా ర్యాలీ నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మ వేషాధారణలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు రామకృష్ణ, నర్సింహారావు, గాంధీ, ఆలెం కోటి, భూషణం పాల్గొన్నారు.

‘ఏజెన్సీ’ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

పినపాక, జనవరి2: మారుమూల ఏజెన్సీ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని గోవిందపురం, గడ్డంపల్లి గ్రామాల్లో రూ.16 లక్షల రూపాయలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. మారుమూల గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాట్ల వాసుబాబు, తహసీల్దార్ యూనస్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాసరెడ్డి, నాయకులు కొండేరు రాము, సత్తిబాబు, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, తదితరలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

‘టీఆర్‌ఎస్‌తోనే బంగారు తెలంగాణ’

అశ్వాపురం: టీఆర్‌ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అశ్వాపురం మండలానికి చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అశ్వాపురం జడ్పీటీసీ సభ్యురాలు లత టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణార్జున్, నాయకులు రామకృష్ణారెడ్డి, అనీల్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమ్మె నోటీసు

దుమ్ముగూడెం జనవరి 2: సీఐటీయూ అనుబంధ మండల ఆశావర్కర్లు మంగళవారం పర్ణశాల, దుమ్ముగూడెం, నరసాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 17న కేంద్ర, రాష్ట్ర కార్మికసంఘాల ఆధ్వర్యంలో జరపతలపెట్టిన స్కీం వర్కర్ల సమ్మెలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఆశాల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిలకమ్మ, మిత్రా, కమిటీ సభ్యులు సుజాత, చిన్నక్క, అమ్మాజీ, వీరమ్మ, అన్నపూర్ణ, భద్రమ్మ పాల్గొన్నారు.

సినిమాలు

భద్రాచలం

- ఉదయభాస్కర్ మిడిల్ క్లాస్ అబ్బాయి
- విజయభాస్కర్ హలో
- గోపాలకృష్ణ టైగర్ జిందాబాయి
- శివం (సారపాక) రోమియో జూలియట్

దుమ్ముగూడెం అధికారుల సమాచారం

తహసీల్దార్	:7680026361
ఎంపీడీఓ	:9440906956
ఎస్ఐ	:9440795307
ఎంఈఓ	:9912170410
రేంజిఅధికారి	:9440810347
విద్యుత్‌శాఖ ఏఈ	:9440811554
మండల ఏఓ	:7288894265
పీఆర్ జేఈ	:9440564966
ఈఓఆర్డీ	:9492091891
ఎక్సైజ్ సీఐ	:9440902683
వెటర్నరీ వైద్యుడు	:9704068729
దుమ్ముగూడెం పీహెచ్‌సీ	:9989027131
నరసాపురం పీహెచ్‌సీ	:8977425496
పర్ణశాల పీహెచ్‌సీ	:9963300896
తాలిపేరు డీఈ	:7075238444
ఇరిగేషన్ ఏఈ	:9100040649
టెలికాం ఏఈ	:9441558855

ప్రతిష్ఠాత్మకం

భద్రాద్రిలో 'ఎంపీటీసీ' కోలాహలం

మూడు పార్టీల నామినేషన్

భద్రాచలంటౌన్, జనవరి 2: భద్రాచలంలో ఎంపీటీసీ-7 ఎన్నికల కోలాహలం నెలకొంది. మూడు పార్టీలూ ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నాయి. కొన్ని పార్టీలు పొత్తులపై చర్చించుకొని.. అభ్యర్థులను రంగంలోకి దింపాయి.

గతంలో ఇలా..

గత ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ-సీపీఐ పొత్తుగా, సీపీఎం కాంగ్రెస్ పార్టీ వేర్వేరుగా పోటీ చేశాయి. 2014లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో 13ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీకి ఏడు స్థానాలు, సీపీఐకి రెండు, సీపీఎం రెండు గెలుపొందాయి. వైఎస్ఆర్‌సీపీ ఒక స్థానం, మరోస్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఈ క్రమంలో సీపీఎం మద్దతుతో టీడీపీ ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకొంది. అయితే టీడీపీ తరపున ఏడో వార్డు నుంచి గెలుపొందిన అజ్మీర సుమిత్ర టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ తరువాత ఆమె ఆ పదవికి రాజీనామా చేశారు. దాంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. మంగళవారంతో నామినేషన్ల దాఖలు ప్రకియ ముగిసింది. కాంగ్రెస్, టీఆర్ఎస్, సీపీఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

11 నామినేషన్ల దాఖలాలు

ఎంపీటీసీ - 7 ఉప ఎన్నికకు నామినేషన్ల చివరి గడువు అయిన మంగళవారం నాటికి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. సీపీఎం నుంచి ఇద్దరు అభ్యర్థులు మూడు నామినేషన్లు వేశారు. టీడీపీకి చెందిన ఒక అభ్యర్థి రెండు నామినేషన్లు దాఖలు చేశారు. టీఆర్ఎస్ నుంచి ముగ్గురు అభ్యర్థులు ఐదు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి ఒక నామినేషను దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ రామ్మూర్తి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పీవీ రామకృష్ణ, ఎంపీడీవో మాచర్ల రమాదేవి పాల్గొన్నారు. నామినేషన్ల పరిశీలన బుధవారం జరగనుంది.





నామినేషన్ దాఖలు చేస్తున్న టీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులు

పాఠశాలల ఫీజులను తగ్గించాల్సిందే

భద్రాచలం టౌన్, జనవరి2: కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల ఫీజులను తగ్గించాల్సిందేనని వివిధ వర్గాల ప్రజలు కోరుతున్నారు. అసలే ఫీజుల భారంతో తల్లిదండ్రులు ఇబ్బంది పడుతుండగా.. ప్రభుత్వం నియమించిన తిరుపతి రావు కమిటీ ఏకంగా ప్రవేట్ పాఠశాలలు పదిశాతం ఫీజు పెంచవచ్చునని నివేదిక ఇవ్వడం సరి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాగళం



ఫీజులు తగ్గించాలి
దశంబాబు, పీఆర్‌టీయూ




ప్రైవేటు పాఠశాలల్లో పెంచుతున్న ఫీజులను తగ్గించాలి. మధ్య తరగతి పిల్లలను ఇంగ్లీషు పాఠశాలలో చదివించాలనే ఆశతో కొందరు తల్లిదండ్రులు చదివిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు పాఠశాలల యజమానులు ఫీజులు పెంచడం ఆందోళనకరం. ప్రభుత్వ యంత్రాంగం సైతం ఫీజుల నియంత్రణపై కఠినంగా వ్యవహరిస్తే మంచిది. నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

తల్లిదండ్రులకు అధిక భారం
రామాచారి, టీపీటీఎఫ్



ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలన్న తల్లిదండ్రులకు ఈ ఫీజులు అధిక భారంతో పాటు ఆర్థిక భారాన్ని సైతం నింపుతుంది. ఎడ్యుకేషన్ యాక్టు 1982, 87 ప్రకారం అమలు చేస్తే ప్రయివేటు పాఠశాలల ఫీజులను నియంత్రించవచ్చు. తిరుపతిరావు కమీషన్ సైతం తల్లిదండ్రుల బాధలు విన్నట్లుగా ఎక్కడా కనిపించడం లేదు. ఫీజుల విషయంలో నియత్రణ ఉండాలి.

ఫీజులు తగ్గించాలి
లక్ష్మి, గృహిణి-భద్రాచలం



ఆర్థిక భారాన్ని ఏడాదికి ఏడాది పెంచుతున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఫీజుల భారం తగ్గిస్తే మంచిది. ఫీజులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో భారం. తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చదివించుకోవాలన్న ఆశ సైతం ఈ ఫీజుల పెంపు వలన దూరం అవుతోంది. నియంత్రించాల్సిన అధికారులు శ్రద్ధ చూపకపోవడం వల్లనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నియంత్రణ ఉండాలి
రాము, భద్రాచలం



ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల పెంపుపై ప్రభుత్వ నియంత్రణ కచ్చితంగా ఉండాలి. దీంతో పాటు ప్రభుత్వం సైతం ప్రత్యేక జీవోను జారీ చేసి ఫీజుల పెంపును నిరోదించేలా ఉండాలి. సౌకర్యాలు సరిగా లేనప్పటికీ పీజులు తల్లిదండ్రులకు గుదిబండగా మారుతున్నాయి. తిరుపతిరావు కమిషన్ ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల బాధలను పట్టించుకునే విధంగా లేదు.

'ఎన్ఎంసీ బిల్లును రద్దు చేయాలి'

భద్రాచలంటౌన్, జనవరి 2: దేశ వ్యాప్తంగా వైద్యులు ఎన్ఎంసీ బిల్లును రద్దు చేయాలని కోరుతూ.. ఐఎంఎ భద్రాచలం శాఖ నేతలు కోరారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సుదర్శన రావు, డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ, ప్రమాణాలు లేని వైద్య విద్యను ప్రోత్సహించడాన్ని వారు నిరసించారు. నిపుణులచే తనిఖీలు లేకుండా ప్రైవేటు వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం నైపుణ్యం లేని వారి చేతిలో ఆట వస్తువుగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో ఎక్కువ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని, దాని వల్ల అర్హులైన పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉంటుందన్నారు. విదేశీ వైద్య విద్యనభ్యసించిన వారికి ఈ దేశంలో ఎటువంటి అర్హత పరీక్ష లేకపోవడం మన దేశంలో ఎంబీబీఎస్ చదివిన వారికి అర్హత పరీక్షపెట్టడాన్ని నిరసిస్తూ ఇది సరైన నిర్ణయం కాదని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డా. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

చర్ల,జనవరి 2: హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే బూడో ఖన్ ఇంటర్నేషనల్ అండర్-8 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన రాహుల్ విజ్ఞాన్ విద్యార్థి కొర్స యశస్వీ రామ్‌చరణ్‌ను మంగళవారం స్థానిక ఏటీఏ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎనిమిది దేశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నా చర్ల విద్యార్థి ప్రతిభ చాటడం హర్షణీయమన్నారు. ఈ కార్యాక్రమంలో పాయం కనకమ్మ, సరస్వతి, విజయలక్ష్మి, విద్యార్థి తల్లి, దండ్రులు కొర్సా చిట్టిబాబు, రామలక్ష్మి, బెండబోయిన సత్యనారాయణ, దేశ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్

భద్రాచలంటౌన్, జనవరి 2: గిరిజనాభివృద్ధిపై ఐటీడీఏ యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కోరారు. మంగళవారం ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీవోగా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ను.. ఐటీడీఏ యూనిట్ అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో యూనిట్ అధికారులు మరింతగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో నారాయణరెడ్డి, అగ్రికల్చర్ ఏవో తాతారావు, పీఈటీసీ ప్రిన్సిపాల్ రమణయ్య, క్రీడల అధికారి చలపతిరావు, డీటీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

'ఉత్సాహంగా పనిచేయాలి'

కొత్త సంవత్సరంలో ప్రతీ ఉద్యోగి ఉత్సాహంగా పని చేస్తూ తమ శాఖల పేరును నిలబెట్టాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీవో (జనరల్) కె.భీమ్‌రావు అన్నారు. మంగళవారం ఐటీడీఏలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. గిరిజనుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ సుజాత, ఐటీడీఏ మేనేజరు హరినాధ్, ఏపీవోపవర్ అనురాధ, డీఎస్‌వో రాజు, ఇంజనీరింగు సిబ్బంది సంతోష్, ఐటీడీఏ గణాంకాల అధికారి సంతోష్, ఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా వేట

- విద్యుత్ వైర్లు, ఉచ్చులు, నాటుతుపాకులతో వధ
- ప్రమాదవశాత్తు మనుషులు, పశువుల మృతి
- కనుమరుగవుతున్న అటవీ జంతువులు
- ఇతర ప్రాంతాలకు మాంసం సరఫరా

అశ్వారావుపేట, జనవరి 2: ఏజెన్సీ ప్రాంతంలో అటవీజంతువుల వేట విచ్చలవిడిగా సాగుతోంది. స్థానిక వేటగాళ్లతో పాటు ఏపీనుంచి వస్తున్న వ్యాపారులు అడవుల్లో మాటు వేసి మరీ జల్సా చేస్తున్నారు. జంతువులను వేటాడి ఈ మాంసాన్ని విక్రయిస్తూ పెద్దఎత్తున వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తున్నారు. ఆంధ్ర ప్రాంతంలో అటవీజంతువుల మాంసం కిలో రూ.500- 800 వరకు పలుకుతోంది. దీంతో పలువురు దీన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. గతంలో సరదాగా, హోదాగా వేటను భావించేవారు. ఇప్పుడు అది ఆదాయమార్గంగా మారింది.

విద్యుత్ వైర్లు, నాటుతుపాకీలు

అడవుల్లో పంట పొలాలు, దట్టమైన అటవీమార్గంలో జంతువులు నడిచే బాటలు, నీటి కొలనుల వద్దకు వచ్చే జంతువులను మట్టుపెట్టేందుకు వేటగాళ్లు వివిధ మార్గాలు అనుసరిస్తున్నారు. విద్యుత్‌లైన్లు అందుబాటులో ఉంటే సన్నని ఇనుపతీగలను 2-3 కిలోమీటర్ల దూరం వరకు ఏర్పాటు చేస్తారు. దీనిద్వారా జంతువులను వేటాడతారు. మరోమార్గం పంట పొలాల వద్ద నాటుబాంబులను ఏర్పాటు చేయడం.. మరికొందరు నాటుతుపాకులతో అడవులను జల్లెడపడుతూ జంతువులను వేటాడుతుంటారు. ఇది అనేక మంది ప్రాణాలను బలిగొంటోంది. మరికొంత మంది గాయపడుతున్నారు. పశువులు, దుక్కిటెడ్లు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అనేకం జరిగాయి. అశ్వారావుపేట ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు బలైన సంఘటనలు ఇలా ఉన్నాయి..

- అశ్వారావుపేట మండలంలోని దురదపాడులోని ఓ గుట్టపైన రెండేళ్ల క్రితం వేటకోసం విద్యుత్ వైర్లు అమర్చారు. ఈ తీగలు తగిలి ఆరునెలల తేడాలో ఇద్దరు మృతిచెందారు.
- 2015 జనవరి 1న తిరుమలకుంటకు చెందిన జుజ్జూరు అన్వేష్ అనే యువకుడు జంతువుల వేటకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తగిలి మృతిచెందాడు.
- 2016 జనవరిలో తిరుమలకుంట కాలనీకి చెందిన మడకం రాజు అనే యువకుడు రెడ్డిగూడెం సమీపంలో పంట పొలాలచుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్లు తగిలి మృత్యువాతపడ్డాడు.
- పండువారిగూడెం, దిబ్బగూడెం, రామన్నగూడెం సమీపంలో నాటుతుపాకీలతో వేటాడే సమయంలో ఓ వ్యక్తి మృతిచెందడమే కాకుండా, అనేక మంది తీవ్రంగా గాయాలైన సంఘటనలు ఉన్నాయి. అనేక పశువులు విద్యుత్‌వైర్లు, ఉచ్చుల బారిన పడి మృతిచెందిన సంఘటనలు జరిగాయి. పోలీసులు తనిఖీల్లో 70కిపైగా నాటుతుపాకీలు పట్టుబడిన సంఘటనలు అప్పట్లో సంచలనం కలిగించింది.
- మండలంలో కన్నాయిగూడెం, కంట్లం, అనంతారం, నందిపాడు, గాడ్రాల, మొద్దులమాడ, దురదపాడు, తిరుమలకుంట, ఊశిర్లగూడెం, రెడ్డిగూడెం అటవీ ప్రాంతాలలో వేట అధికంగా జరుగుతుంది.
- చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలోని మహబూబునగర్, అబ్బుగూడెం,అన్నపురెడ్డిపల్లి, మద్దుకూరు, పోకలగూడెం, బెండాలపాడు, రావికంపాడు, తుంగారం తదితదర గ్రామాలలో అత్యధికంగా జంతువుల వేట జరుగుతోంది.
- రెండేళ్ల క్రితం అబ్బుగూడెంలో వేటగాళ్ల మాంసంలో విషం కలపడంద్వారా రెండు చిరుతపులలను చంపారు.
- తాజాగా పోకలగూడెంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్లు తగిలి బాదావత్ భద్రి(50) మృతిచెందిన సంఘటన జరిగింది.
- పోకలగూడెంలో అడవిపందులకోసం ఏర్పాటు చేసిన నాటుబాంబులను కొరికి కుక్క మృతిచెందింది.
- మహబూబ్‌నగర్‌లో వేటగాళ్ళు ఏర్పాటు చేసిన ఉచ్చులు,, నాటుతుపాకీలు, బాంబుల వల్ల అనేక మంది గాయపడ్డారు. పశువులు మృతి చెందాయి.
- జూలూరుపాడు మండలంలో వినోభానగర్, సూరారం, నల్గొండబూమ్, పాపకొల్లు, చూరారంలో అధికంగా అటవీజంతువులను వేటాడతారు. చూరారంలో ఏడాది క్రితం జంతువుల వేటకోసం అమర్చిన విద్యుత్‌వైర్లు తగిలి ఒక వ్యక్తి, రావంచంద్రాపురంలో నాటుబాంబుల వద్ద ఇద్దరు తీవ్రంగా గాయాలపాలైయ్యారు.
- ములకలపల్లి మండలంలోని రాసన్నపేట, కుమ్మరిపాడు, తోగ్గూడెం, తాళ్ళపాయి, గుండెళ్ళపాడు గ్రామాలలో వేట అధికంగా సాగుతోంది. రెండు సంవత్సరాలలో ఒక్కో గ్రామంలో ఒక్కరు చొప్పున ఐదుగురు మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు.

యథేచ్ఛగా మాంసం వ్యాపారం

స్థానిక వేటగాళ్ల పాటు ఏపీ నుంచి వేటగాళ్లు నియోజకవర్గంలోని పలు అటవీ ప్రాంతాలను జల్లెడపడుతున్నారు. వివిధ రకాలుగా జంతువులను వేటాడి మాంసాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. అటవీజంతువుల మాసం కిలో రూ.500 నుంచి 800వరకు విక్రయిస్తుంటారు. ఇతర ప్రాంతాలలో ఈ మాంసానికి మంచి డిమాండ్ ఉంది. దీంతో వేటగాళ్లు పెద్దఎత్తున అడవుల్లో మోహరించి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలు, రాజధానికి కూడా ఈ ప్రాంతం నుంచి మాంసం సరఫరా అవుతోంది.

తాను తీసిన గోతిలోనే!

- అటవీ జంతువుల వేటకు వెళ్లి ఒకరి దుర్మరణం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, భద్రు మృతదేహం

చంద్రుగొండ, జనవరి2: అటవీ జంతువుల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం చంద్రుగొండ మండలం పోకలగూడెంలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బాదావత్ భద్రు(50), బాణోతు బంజా, గుగులోతు హనుమా, బాదావత్ భద్రు సోమవారం రాత్రి వంక నెంబర్ శివారులోని రాతిగుట్ట చెరువు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి వేటకు వెళ్లారు. అక్కడ 11కెవి విద్యుత్‌లైన్‌కు తీగలు తగిలించారు. బైండింగ్ వైర్‌ను అటవీ ప్రాంతంలో అమర్చారు. ప్రమాదవశాత్తు వారు అమర్చిన తీగకు బాదావత్ భద్రు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని వారు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.మృతుడికి భార్య గాంగ్లి, కుమార్తె విజయ, కుమారులు లక్ష్మా, బాలాజీ ఉన్నారు. అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి వచ్చే అడవి పందులు, దుప్పులు, కణుజులు లాంటివి వేటాడేందుకు విద్యుత్ వైర్లు అమర్చినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎస్‌ఐ ప్రసాదు తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్, డ్రైవర్‌పై కేసు

- విహారయాత్రలో విషాదంఘటనపై చర్యలు
- ఆసుపత్రి వద్ద మిన్నంటిన రోదనలు

అశ్వారావుపేట రూరల్, జనవరి 02: అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి వద్ద విద్యుదాఘాతంతో విద్యార్థి చనిపోయిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఫిర్యాదు మేరకు కామారెడ్డి జిల్లా బీచ్‌కుండా మండలం శ్రీరేణుకా ఓకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ వి.మహేందర్, తుఫాన్ వాహన డ్రైవర్ ఎస్.సాయిబాబాపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. మృతదేహానికి మంగళవారం అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఫోన్‌చేసిన అరగంటలోనే..

'అరగంట క్రితమే ఫోన్ చేశావు...అమ్మా భద్రాచలం వెళుతూ అశ్వారావుపేటలో ఆగాము.. రాముడిని దర్శించుకుని రాత్రికి చేరతానన్నావు.. ఇంతలోనే ఇంటికి చేరకుండానే కానరాని లోకాలకు వెళ్లావా కొడుకా' అంటూ సందీప్ తల్లి శవంపై పడి రోదించిన తీరు అందరినీ కన్నీరు పెట్టించింది. సందీప్ మృతివార్త తెలుసుకున్న తల్లిదండ్రులు విఠల్, లక్ష్మీ, తమ్ముడు సతీశ్‌తో బంధువులు పెద్దఎత్తున సోమవారం రాత్రి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. మార్చురీలో విగతజీవిగా ఉన్న సందీప్‌ను చూసి.విలపించారు. పండుగకు కరీంనగర్‌లో ఉన్న మామయ్య ఇంటికి వెళదామంటూ చెప్పిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడంటూ తల్లి గుండెలు పగిలేలా రోదించారు. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు విషాదాన్ని మిగిల్చాడని తండ్రి విఠల్, బంధవులు విలపించారు. కుటుంబసభ్యులంతా మంగళవారం ఉదయం సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు.



రోదిస్తున్న సందీప్ తల్లి, బంధువులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- దైవదర్శనానికి వెళ్లొస్తుండగా ఘటన

కల్లూరు, జనవరి 02: ఏపీలోని కృష్ణాజిల్లా జి.కొండూరు మండల సమీపాన ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లూరుకు చెందిన మహిళ ఒకరు మృతి చెందారు. కల్లూరుకు చెందిన మిట్లపల్లి రామకృష్ణ, అరుణ(28) దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి విజయవాడ వెళ్లారు. నూతన సంవత్సరం సందర్భంగా కనకదుర్గామాత ఆలయంలో పూజలు జరుపుకొన్నారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామమైన కల్లూరుకు వస్తుండగా కృష్ణాజిల్లా జి.కొండూరు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయిన క్రమంలో కారు పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో అరుణ మృతి చెందింది. ఈ సమయంలో కారులో ఉన్న భర్త రామకృష్ణ కొంత సమయానికి తేరుకుని అద్దాలు పగులకొట్టి పిల్లలను బయటకు తీసుకువచ్చాడు. రామకృష్ణ కల్లూరులోని వేణుగోపాల రైస్ మిల్లులో పార్టనర్‌గా ఉన్నారు.



అరుణ(ఫైల్)

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం: యువకుడి మృతి

ఖమ్మంక్రైం, జనవరి2: అతివేగం ఓ ద్విచక్ర వాహనదారుడి ప్రాణం తీసింది. నేపాల్‌కు చెందిన అభిరాం (20) అనే యువకుడు రెండు నెలలుగా ఖమ్మం బస్టాండ్ సెంటర్‌లోని మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు.. సోమవారం రాత్రి పన్నెండు గంటల సమయంలో మయూరి సెంటర్ నుంచి మామిళ్లగూడెం వైపు వేగంగా వెళుతున్నాడు. ఈక్రమంలో వాహనం మలుపు వద్ద అదుపు తప్పి ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ గోడను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మెడికల్ షాపు యజమాని హరీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీనీటి బొట్టూ లెక్కే..!

- సాగర్‌నీటి వినియోగంపై లెక్కలకు సిద్ధం
- నేటినుంచి ఐదు రోజులు పర్యటించనున్న కేంద్ర జలవనరుల సంఘం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 2: నదీజలాల వినియోగంపై ఘర్షణలు లేకుండా నివారించేందుకు కేంద్ర జలవనరుల సంఘం సిద్ధమవుతోంది.ఇకనుంచి ప్రతీ నీటిబొట్టునూ లెక్కించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. కొన్నేళ్లుగా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ, ఆంధ్రా ప్రభుత్వాలు కృష్ణానదీబోర్డుకు, కేంద్ర జలవనరుల సంఘానికి సరస్పర ఫిర్యాదులు చేస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో వివాదం జఠిలం కాకుండా నిరోధించేందుకు అసలు నీటి వినియోగాన్ని , వృథాను అంచనా వేసేందుకు జలవనరుల సంఘం అనుమతి ఇచ్చింది. మంగళవారం బోర్డు సభ్యులు నాగార్జున సాగర్ డ్యాం నుంచి ఎడమ కాలువపై పర్యటించారు. సాయంత్రానికి సూర్యాపేట,ఖమ్మం జిల్లా సరిహద్దుకు చేరుకున్నారు.పరిశీలన జరిపిన వారిలో కేంద్ర జలసంఘం సభ్యులు కన్వీనర్ డిప్యూటీ డైరెక్టర్ ఆనంద్‌కుమార్,సహాయ సంచాలకులు కో కన్వీనర్ రమేష్‌బాబు, తెలంగాణ నుంచి ఈఈలు మంగళపూడి వెంకటేశ్వర్లు, అక్బర్ పాషా, ఆంధ్రా అధికారులు నూజివీడు డీఈ శ్రీనివాస్, కంచికచర్ల డీఈ పరమహంసారెడ్డి తదితరులు బృందంలో ఉన్నారు.

ఏడీసీపీ యంత్రంతో పరిశీలన

ఏడీసీపీ (ఎక్కొటింగ్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్)తో నదుల్లో జలవనరుల సంఘం సర్వేలను నిర్వహిస్తోంది. ఈ యంత్రాన్ని నదికి, కాలువకు రెండు చివరలకు తాడుతో కట్టి యంత్రానికి అనుసంధానం చేస్తారు. యంత్రానికి వైఫ్ ఇంటర్నెట్ కనెక్షన్‌తో అనుసంధానం చేసి కంప్యూటర్‌తో నిక్షిప్తం చేస్తారు. దాని సహాయంతో నది ఎంత లోతు ఉంది, ఎంత పరిమాణంలో నీరుంది అనే విషయాలను లెక్కకట్టి చూపిస్తుంది.



నాగార్జున సాగర్ డ్యాం సమీపంలో నీటి పరిమాణాన్ని అంచనా వేస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

దమ్మపేట, జనవరి 2: చలిమంట కారణంగా గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వివరాల ప్రకారం.. గతనెల 20 తెల్లవారుజామున నాగుపల్లిలో పులిచర్ల పార్వతి(80) చలికాగేందుకు కుంపటి వెలిగించుకుంది. పార్వతి చీరకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. మంటలతో పార్వతి కేకలు వేస్తుండటంతో కుటుబ సభ్యులు గమనించారు. సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది.

మందుబాబులకు రూ. 82,500 జరిమానా

ఖమ్మం క్రైం, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినవారికి జడ్జి రూ. 82,500 జరిమానా విధించారు. డిసెంబర్ 31 రాత్రి పోలీసులు తనిఖీ నిర్వహించగా వీరు దొరికారు. వారిని మంగళవారం జిల్లా కోర్టులో హాజరు పర్చారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ బి. సుబ్బలక్ష్మి నిందితులకు జరిమానా విధించారు. అనంతరం వారికి ట్రాఫిక్ ఏసీపీ సదానిరంజన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ జరిపారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 5, 6


మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బదిలీలు, మార్పుల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇల్లు, స్థలం మార్పు విషయంలో పెద్దల సహకారం లభిస్తుంది. కుటుంబ వ్యవహారాలు ఊరటనిస్తాయి. చేపట్టిన పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు.


వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కీలక సందేశాలు అందుకుంటారు. రక్షణ, న్యాయ, బోధన, పర్యాటక రంగాల వారికి శుభప్రదం. వాహన సౌకర్యం కలుగుతుంది. విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి లక్ష్యాలు సాధిస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. వాయిదా పద్ధతులపై విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకుంటారు.


కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పందాలు, పోటీలు, స్పెక్యులేషన్లలో విజయం సాధిస్తారు. స్నేహానుబంధాలు బలపడతాయి. వేడుకలు, సమావేశాల్లో కీలకపాత్ర పోషిస్తారు. లక్ష్య సాధనలో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఖర్చులు అధికం.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): చేపట్టిన పనులను సమీక్షించుకుంటారు. గత అనుభవంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. డైటింగ్, యోగధ్యానాలపై దృష్టి పెడతారు. సహోద్యోగులకు సంబంధించిన రహస్య సమాచారం అందుకుంటారు.


కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): చిన్నారులు, ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. పొదుపు పథకాల నుంచి మంచి ప్రతిఫలం అందుకుంటారు. స్నేహానుబంధాలు వికసిస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.


తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బదిలీలు, మార్పులకు అనుకూల సమయం. పెద్దల సహకారంతో వృత్తి వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. గౌరవ పదవులు అందుకుంటారు. ప్రభుత్వ సంస్థలు, రియల్ ఎస్టేట్ రంగాల వారికి ప్రోత్సాహకరం.


వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. కళలు, సాహిత్యం, ప్రణాళికలు, టూరిజం రంగాల వారు కీలక సమాచారం అందుకుంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. డ్రైవింగ్‌లో జాగ్రత్తలు అవసరం.


ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీలు లాభిస్తాయి. భీమా, గ్రాట్యుటీ, పెన్షన్ వ్యవహారాలకు అనుకూలం. రుణప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకుంటారు. విందుల్లో ఖర్చులు అధికం.


మకరరాశి(డిసెంబర్22-జనవరి21): జనసంబంధాలు విస్తరిస్తాయి. పందాలు, పోటీలపై దృష్టి పెడతారు. భాగస్వామి విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రేమానుబంధాలు బలపడతాయి. న్యాయ, రక్షణ రంగాల వారికి ప్రోత్సాహకరం. ఖర్చులు అధికం.


కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పనివారి నియామకానికి అనుకూలం. వృత్తి, వ్యాపార విషయాలను సమీక్షించుకుంటారు. ఆహార నియమాలు పాటిస్తారు. సహోద్యోగుల ఆంతరంగిక విషయాలపై దృష్టి పెడతారు.


మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్య, క్రీడలు, బ్యాంకుల రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్పం నెరవేరుతుంది. ఖర్చులు అధికం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..



● భద్రాచలం రామయ్య

కాటేజ్/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	19
వందగదుల సదనం	62	43
శ్రీరామ సదనం	18	11
టీటీడీ సదనం	26	13
సౌమిత్రి సదనం	30	21

తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

సంప్రదించండి..

దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671

నిత్య సేవలు ఇలా..

- తెల్లవారుజామున 4.30కి సుప్రభాతసేవ.
- 5.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, నివేదన సేవాకాలం.
- ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సహస్రనామార్చన.
- 8.30 నుంచి 11.30 వరకు, 12.30 నుంచి 1గంట వరకు, 3 నుంచి 8 గంటల వరకు మూల వరుల వద్ద అర్చన.
- 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు నిత్య కల్యాణం.
- 11.30 నుంచి 12గంటల వరకు రాజభోగం.
- మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఆలయ తలుపులు మూస్తారు.
- రాత్రి 7గంటల నుంచి 8 వరకు దర్బారు సేవ.
- 8.30 నుంచి 9 గంటల వరకు నివేద బోగం అనంతరం పవళింపు సేవ. ఆ తర్వాత ఆలయం తలుపులు మూస్తారు.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20



● జమలాపురం వెంకన్న

కాటేజ్/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్ఎన్ఎన్	10	08

నిత్య పూజలు

- *తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.*
- *5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.*
- *6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.*
- *ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.*
- *7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.*
- *10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.*
- *సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.*

సంప్రదించాల్సిన నెం: 08749-279855 ● ఈవో రమణమూర్తి: 9491000705 ● ప్రధానార్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 9989507300

నేడు రాష్ట్ర స్థాయి టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 2: క్రికెట్ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్రస్థాయి టీ-20 క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నా మని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చేకూరి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ప్రకాశం మైదానంలో టీ-20 క్రికెట్ పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర మాజీమంత్రి జి. వెంకటస్వామి స్మారకార్థం జి. వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ టీ-20 (టీటీ 20ఎల్)ను డిసెంబరు 22న సికింద్రాబాద్‌లో జింఖానా స్టేడియంలో ప్రారంభించారని గుర్తుచేశారు. ఐపీఎల్ తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాలో జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. మొత్తం 135 మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా, వాటిలో 52 మ్యాచ్‌లు వివిధ జిల్లాల్లో 83 మ్యాచ్‌లు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారన్నారు. కొత్తగూడెం లో ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించే ఈ పోటీల్లో నాలుగు జిల్లాలు పాల్గొంటున్నాయన్నారు. గెలుపొందిన వారు ఈ నెల 9, 10తేదీల్లో సిద్ధిపేటలో సెమీ ఫైనల్స్‌లో పాల్గొంటారని, ఫైనల్స్ మ్యాచ్ ఫిబ్రవరి 15న రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం - హైదరాబాద్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ టీ-20 క్రికెట్ పోటీల్లో సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాల జట్లు పాల్గొంటాయన్నారు. 3న భద్రాద్రి కొత్తగూడెం వర్సెస్ సూర్యాపేట, ఖమ్మం వర్సెస్ మహబూబాబాద్, 4న భద్రాద్రి కొత్తగూడెం వర్సెస్ మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వర్సెస్ ఖమ్మం జట్లలో ఆరు మ్యాచ్‌లను నిర్వహించేందుకు ఘనంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.


ఏర్పాట్లను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు



[redacted] పంటల ధరలు

క్వింటాలుకు రూపాయల్లో

పంట	కనిష్ఠం	గరిష్ఠం
పత్తి	4,300	5,100
మిర్చి	7,500	9,000
మిర్చి (తాలు)	4,000	4,000
కందులు	3,100	4,080
మిర్చి (ఏసీ)	6,500	8,800
పెసలు	2,850	4,200
మినుములు	-	-
మొక్కజొన్న	1,160	1,160
వేరుశనగ	2,800	2,800

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- **గురుకుల సొసైటీ జిల్లా సమన్వయకర్త రత్నకుమారి**



కొణిజర్ల, జనవరి 2: గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో 2018-19 సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు గిరిజన గురుకుల సొసైటీ జిల్లా సమన్వయకర్త పి రత్నకుమారి మంగళవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 31జిల్లాల గిరిజన బాలుర విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఫిబ్రవరి నాలుగున నిర్వహించే ప్రవేశ పరీక్షకు హజరు కావాలని సూచించారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య, వసతి, స్టడీ మెటీరీయల్ ఉచితంగా అందించడమే కాకుండ ఐఐటీ, నీట్, ఎంసెట్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లంబాడాలను తొలగించే వరకూ ఉద్యమం

- **ఎస్టీ జాబితానుంచి తొలగించేవరకు ఆందోళన**
- **ఆదివాసీ ఎమ్మెల్యేలు భాగస్వామ్యం కావాలి**
- **జేఏసీ సంఘాల రాష్ట్ర చైర్మన్ నాగేశ్వరరావు**

కొత్తగూడెం టౌన్, జనవరి 2: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు విస్మరించమని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నామని, ఆదివాసీ ఎమ్మెల్యేలు భాగస్వామ్యం కావాలని ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2007నుంచి ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగ బద్ధంగా 342 జీవో ప్రకారం లంబాడాలు ఎస్టీ జాబితాలో గుర్తించలేదన్నారు. వారిని ఎస్టీలో కలుపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ఆధారాలు చూపిస్తారని, ఇప్పటికే సమాచార చట్టం ప్రకారం వివరాలు సేకరిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం కూడా పట్టించుకోవడంలేదని, ఉద్యమం తీవ్రతరమైతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రత్యేక ఉద్యమాలు చేపట్టేందుకు ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తీర్మానాలు చేశామన్నారు. ఎనిమిది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో మహా ధర్నాలు, జనవరి 11న ఐటీడీఏలో ముట్టడి, 17న మేడారంలో ఆదివాసీ తెగల సమ్మేళనం, జనవరి 22న కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు, ఫిబ్రవరి తొలి వారంలో ఆదివాసీలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, ఫిబ్రవరి 22న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు, లంబాడాలకు మధ్య జరుగుతున్న పోరులో పోలీసులు కూడా సమన్వయంగా వ్యవహరించాలని, గిరిజన ప్రాంతాల్లో విధించిన 144 సెక్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు పూనెం రాంచందర్‌రావు, కాయం అరుణ, నాగబోయిన చంద్రయ్యదొర, సోము సత్యనారాయణ, సనప కోటేశ్వరరావు, కన్నెబోయిన వెంకట నర్సయ్య, శెట్టిపల్లి రజనిబాబు, బట్టు కనకరాజు, సోడె కేశవ్, ఎట్టి శ్రీనివాస్‌రావు, పెండెకట్ల యాకయ్య, శివ, పూనెం నాగేశ్వరరావు, సురేందర్, సుధాకర్, వజ్జా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకుడు నాగేశ్వరరావు

మారిందేమీ లేదు..

- ఎమ్మెల్యే మదన్‌లాల్ దత్తత గ్రామంలో సమస్యల తిష్ట
- అవస్థలు పడుతున్న తనికెళ్ల వాసులు


తనికెళ్ల గ్రామం వ్యూ

కొణిజర్ల, జనవరి 2: తమ గ్రామాన్ని ఎమ్మెల్యే దత్తత తీసుకొని రెండున్నరేళ్లు గడుస్తున్నా.. అప్పటికీ ఇప్పటికీ వచ్చిన మార్పు పెద్దగా ఏమీ లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామస్థులు. వైరా శాసన సభ్యుడు మదన్ లాల్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కానీ.. ఇప్పటి వరకూ అభివృద్ధి చేసింది అంతంతమాత్రమే అనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

అంతంతే..

తనికెళ్లలో సుమారు 8వేల మంది జనాభా ఉంది. గ్రామంలోని 14 వార్డుల్లో సమస్యల్లో తిష్టవేశాయి. అంతర్గత రహదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వీధులన్నీ బురదతో నిండిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాగునీటి సమస్య సైతం గ్రామాన్ని వేధిస్తోంది. ఎస్సీకాలనీ, బీసీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ లైన్ తొలగించాలని, పంచాయతీ భవనం పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు. కానీ.. గ్రామంలో ఇప్పటి వరకూ నాలుగు సిమెంట్ రోడ్లు, బీసీకాలనీలో కొత్తగా విద్యుత్‌కేబుల్ వైరు వేయించడం మాత్రమే చేశారని గ్రామస్థులు చెబుతున్నారు.

తాగునీటికీ కటకటే..

బీసీకాలనీలో, ఎస్సీకాలనీలతోపాటు, గ్రామంలోని పలు వీధుల్లో సిమెంట్ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గంగెడ్లపాడు కాలనీలో ఒక్క సిమెంట్ రోడ్డు కూడా లేదు. వర్షాకాలం వచ్చిందంటే బురద నిండిన రోడ్లపై నడవలేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.. ఇక తాగడానికి కూడా సరిగా నీళ్లు లేవని ఆవేదన చెందుతున్నారు. వైరా నుంచి వచ్చే నీళ్లే వాడుకోవాలసి వస్తుందని, అవి తాగటానికి ఏ మాత్రం పనికిరావడంలేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. చివరి వీధుల్లో విద్యుత్‌స్తంభాలు లేకపోవడంతో.. రాత్రివేళ జనం ఇబ్బందులు పడుతున్నారు. కాలిబాటల వెంట పాములు సంచరిస్తున్నాయని, చీకటైతే బయటకు వెళ్లాలంటేనే ఆలోచించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇక, గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కూడా ముందుకు సాగడం లేదు. ఇప్పటికైన ఎమ్మెల్యే స్పందించి, దత్తత గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దత్తత గ్రామం చూద్దాం రండి..


వర్షాకాలంలో బీసీకాలనీ రోడ్డు పరిస్థితి (ఫైల్)

మార్పు కనిపించట్లేదు..

అప్పికట్ల రామారావు, స్థానికుడు



గ్రామంలో సమస్యలు అలాగే ఉన్నాయి. దత్తత గ్రామంగా ప్రకటించిన తర్వాత మార్పు ఏమీ కనిపించడం లేదు. వైరా నుంచి మురుగు నీరు వస్తోంది. ఇది రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. గ్రామంలో సిమెంట్ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రజలు కోరుకున్న అభివృద్ధి వచ్చినప్పుడే సంతోషపడతారు.

సమస్యలు పరిష్కరించాలి..

సాంబయ్య, స్థానికుడు



గంగెడ్లపాడు కాలనీలో తాగునీటి సమస్య ఉంది. మంచినీటి కోసం చాలా దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. కొన్ని బజార్లలో వీధిలైట్లు లేవు. దీంతో.. రాత్రిపూట పాముల భయం వెంటాడుతోంది. అదేవిధంగా ఈ కాలనీలో ఒక్క సిమెంట్ రోడ్డుకూడా లేదు. ఎమ్మెల్యే స్పందించి, ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

ఖమ్మంలో.. ఫోరెన్సిక్ ల్యాబ్



- మూడు విభాగాల ఏర్పాటుకు సన్నాహాలు
- రూ.50 లక్షలు కేటాయించిన ప్రభుత్వం
- ల్యాబ్‌లో ఎస్పీ, ఏఎస్పీ కేడర్ అధికారి
- స్థలం వెతికే పనిలో అధికారులు

(ఆంధ్రజ్యోతి - ఖమ్మం) రోజురోజుకూ నేరాలు పెరిగిపోతున్నాయి. నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో క్రైమ్‌లకు పాల్పడుతున్నారు. తెలివిగా వ్యవహరిస్తూ ఎలాంటి ఆధారాలూ లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి క్లిష్టమైన కేసులను చేధించేందుకు పోలీసులు ఆశ్రయించే విభాగం 'ఫోరెన్సిక్'. అంతటి ముఖ్యమైన ఫోరెన్సిక్ ల్యాబ్‌లను జిల్లాల్లో కూడా ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలోనూ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

అత్యంత కీలకం..

ప్రస్తుత టెక్నాలజీమయ ప్రపంచంలో నేరగాళ్ల పంథా మారింది. నేరస్థులు విభిన్న మార్గాల్లో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. తెలివితేటలతో ఆధారాలను మాయం చేయడానికి కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. వీరి భరతం పట్టేందుకు పోలీసులు ప్రయోగించే అత్యంత కీలకమైన అస్త్రం ఫోరెన్సిక్ సైన్స్. జరిగిపోయిన సంఘటనలకు సంబంధించిన ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, పరిశీలించేదే ఫోరెన్సిక్ విభాగం. ఇది నేర పరిశోధన కోసం సాక్ష్యాలను సేకరించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సంఘటనా స్థలంలో లభించిన తల వెంట్రుకలు, వేలిముద్రలు, రక్తపు చుక్కలు, గోళ్లు వంటి చిన్న ఆధారాలతో కూడా కీలక సాక్ష్యాలను రూపొందించి నేరస్థులను కటకటాల వెనక్కు పంపగలిగే శాస్త్రమిది. స్కానింగ్, ఎలక్ట్రిక్ మైక్రోస్కోప్, ఎక్స్‌రే, పౌడర్ డిఫ్రాక్షన్ల సాంకేతిక పరిజ్ఞానం ఫోరెన్సిక్ మెడిసిన్‌లో ప్రధానమైనవి. శరీరంలో విషపదార్థాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో.. విశ్లేషించడం, చాకచక్యంగా దొంగనోట్లను పట్టుకోవడం, రక్తపరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులను గుర్తించడం మొదలైన నేరపరిశోధనలన్నీ సైన్స్‌పైనే ఆధారపడుతుంటాయి.

విచారణ వేగిరం..

ఇప్పటి వరకు జిల్లాలో జరిగేటువంటి నేరాలను అదుపు చేసేందుకు పోలీసు శాఖ సాంకేతికతను విరివిగా ఉపయోగించుకుంటోంది. హాక్‌ఐ, ఫింగర్‌ప్రింట్ యాప్, ఇతరత్రా సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం వంటి విషయాల్లో జిల్లా పోలీసు అధికారులు ముందంజలోనే ఉన్నారు. అయితే.. ఇన్నాళ్లు పెద్ద పెద్ద నేరాలు జరిగినప్పుడు నేరస్థులు ఆధారాలను మాయం చేసినటువంటి కేసులను జిల్లా పోలీసులు చేధించడం కాస్తంత ఆలస్యమయ్యేది. పెద్ద నేరాలకు సంబంధించిన క్లూస్ సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, అక్కడి నుంచి రిపోర్టు వచ్చే వరకు కేసు ముందుకు కదలడం కష్టతరంగా ఉండేది. రాష్ట్రంలో కేవలం హైద్రాబాద్‌లో మాత్రమే ఫోరెన్సిక్ ల్యాబ్ ఉంది. జిల్లాలో జరిగే నేరాల వివరాలు అక్కడి నుంచి వచ్చే వరకు ఆగాల్సి ఉండేది. అయితే.. ప్రస్తుతం జిల్లాల్లోనూ ఫోరెన్సిక్ లాబ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు ల్యాబ్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. వాటిల్లో జిల్లాకు స్థానం దక్కడం విశేషం. కాగా.. ఇక నుంచి ఖమ్మం జిల్లాతోపాటుగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చేరాల్సిన చిన్నపాటి కేసులన్నింటికీ ఇక్కడే పరిష్కారం లభించనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటుగా చుట్టుపక్కల జిల్లాలైన వరంగల్, నల్గొండకు సంబంధించిన కేసులను కూడా జిల్లాలో ఏర్పాటు చేసే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించగా, జిల్లా పోలీసు అధికారులు స్థలం కోసం అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది.

మూడు విభాగాల ఏర్పాటు..

నేరస్థుల భరతం పట్టే ఫోరెన్సిక్ సైన్సులో ఫోరెన్సిక్ ఆర్కియాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, మెడిసిన్, లింగ్విస్టిక్స్, సిరియాలజీ, కంప్యూటింగ్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, సైబర్ ఫోరెన్సిక్స్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఎగ్జామినర్, ఫోరెన్సిక్ గ్రాఫాలజీ, ఫొటోగ్రఫీ, ఆడియో అండ్ వీడియో ఎనాలసిస్, సెల్‌ఫోన్ ఫోరెన్సిక్, ఫోరెన్సిక్ ఒడంటాలజీ, ఎంటమాలజీ, మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, వైల్డ్‌లైఫ్ ఫోరెన్సిక్ వంటి విభాగాలు ఉన్నాయి. అయితే.. వీటిల్లోంచి కేవలం మూడు విభాగాలు మాత్రమే డిస్ట్రిక్ ఫోరెన్సిక్ లాబ్ (డీఎఫ్ఎస్ఎల్)లో ఏర్పాటు చేయనున్నారు. వాటిల్లో టాక్సికాలజీ, బయాలజీ, సిరియాలజీ విభాగాలను జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఆయా విభాగాల ద్వారా బ్లడ్ గ్రూప్ ఏంటీ, ఏ పాయిజన్ తీసుకుని చనిపోయారు? కాల్చుకుని చనిపోవడానికి కారణాలు ఏంటి? వంటి అంశాలను హైద్రాబాద్‌కు రిపోర్టు పంపకుండానే జిల్లాలో ఏర్పాటు చేసే ఫోరెన్సిక్ ల్యాబ్‌లోనే తెలుసుకోవచ్చు.



ఎస్పీ, ఏఎస్పీ స్థాయి అధికారితో మానిటరింగ్..

జిల్లాలో ఏర్పాటు చేసే డీఎఫ్ఎస్ఎల్‌లకు అథారిటీగా రీజినల్ డైరెక్టర్ ఉంటారు. ఆ పోస్టులలో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి వ్యక్తులు మానిటరింగ్ చేస్తూ ఉంటారు. వీరితోపాటుగా మరో 15మందికి పైగా ల్యాబ్‌లో పనిచేయనున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సంబంధించి ఏపీ పునర్విభజన చట్టం 10వ షెడ్యూల్ అడ్డుగా ఉండటంతో ఫోరెన్సిక్ ల్యాబ్‌లలో ఇన్నాళ్లు నియామకాలు చేపట్టలేదు. అయితే.. ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేసే డిస్ట్రిక్ ఫోరెన్సిక్ లాబ్ (డీఎఫ్ఎస్ఎల్)లు తెలంగాణకు సంబంధించినవే కాబట్టి.. సిబ్బందిని నియమించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. చిన్న చిన్న విషయాలకు కూడా హైద్రాబాద్ వరకు రావాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్న పని, అంతేకాదు ఆయా.. కేసులకు సంబంధించి పోస్టుమార్టం దగ్గర నుంచి రిపోర్టు రావడం, అక్కడి మళ్లీ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఎగ్జామినేషన్ చేయడం, దాని రిపోర్టు పంపడంతో సమయం వృథా అవుతోంది. దీనివల్ల కేసులు పెండింగ్‌లో ఉంచాల్సిన పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఎఫ్ఎస్ఎల్ ఏర్పాటు నిర్ణయం తీసుకుందని అధికారులు అంటున్నారు. అయితే, డాక్యుమెంట్ పనులు, వెపన్ సంబంధిత కేసులను మాత్రం హైద్రాబాద్‌కు పంపించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఆదర్శ గ్రామం రామన్నపాలెం

- నూరు శాతం మరుగుదొడ్లు, ప్రతీ ఇంట్లో గ్యాస్ సిలిండర్
- ఓడీఎఫ్ గ్రామంగా నేడు ప్రకటించనున్న అధికారులు

వేంసూరు, జనవరి 2: మండలంలోని రామన్నపాలెం గ్రామపంచాయతీ ఆదర్శంగా నిలిచింది. నూరు శాతం మరుగుదొడ్ల నిర్మితమైన ఈ పంచాయతీలోని ప్రతీ ఇళ్లు గ్యాస్ కనెక్షన్ కలిగి ఉంది. గ్రామాభివృద్ధిలో మండలంలోనే ఆదర్శంగా నిలిచిన రామన్నపాలెంను నేడు ఓడీఎఫ్ గ్రామంగా అధికారులు ప్రకటించనున్నారు.

కలిసి కట్టుగా..

పంచాయతీ పరిధిలోని పది వార్డుల్లో 1610 మంది జనాభా, 1171 మంది ఓటర్లు ఉన్నారు. కుటుంబాల పరంగా చూస్తే 590 ఉన్నాయి. ఈ గ్రామంలో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తయ్యాయి. గ్రామంలో ప్రతివీధిలోని కరెంట్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులను అమర్చారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు. బోర్లను తవ్వించి, మోటార్లను అమర్చడంతో పాటు చేతిపంపులను ఏర్పాటు చేశారు. పంచాయతీ అభివృద్ధి, ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. పంచాయతీ సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ప్రభుత్వం నుంచి రూ.9లక్షల అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆరుబయట చెత్త వేయకుండా స్వచ్ఛ భారత్‌లో భాగంగా పంచాయతీకి చెత్తను స్వీకరించే రిక్షాలు మంజూరు కావడంతో ఆరుబయట చెత్తను వేయకుండా గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచారు. అదేవిధంగా ప్రతీ ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని, ఆదర్శంగా నిలిచారు. దీంతో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణం, గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉండడంతో ఓడీఎఫ్ గ్రామంగా బుధవారం అధికారికంగా ప్రకటించనున్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించారని మరిన్ని నిధులు మంజూరు చేస్తే గ్రామంలో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణాలను చేపడతామని ఎంపీడీవో గోవిందరావు, ఈవోఆర్డీ బి.అశోక్, సర్పంచి కుక్కపల్లి నాగమణి అంటున్నారు.


రామన్నపాలెం ముఖద్వారం


పక్కా ఇల్లు లేకున్నా.. మరుగుదొడ్డి నిర్మించుకున్న దృశ్యం

రామన్నపాలేన్ని ఆదర్శంగా తీసుకోవాలి..

- బండి గోవిందరావు, ఎంపీడీవో, వేంసూరు



మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ రామన్నపాలెంను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధిలో ముందుండాలి. నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసి, ప్రతీ ఇళ్లు గ్యాస్ కనెక్షన్‌ను పొంది, ఓడీఎఫ్ గ్రామంగా ఎంపికకావడం సంతోషంగా ఉంది.

అభివృద్ధికి సహకరించిన అందరికీ అభినందనలు

- ఎస్.రాజగోపాల్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, రామన్నపాలెం



రామన్నపాలెం గ్రామంలో అభివృద్ధికి సహకరించిన గ్రామస్థులు అందరికీ అభినందనలు. గ్రామంలో ప్రతీ ఒక్కరూ అభివృద్ధి కోసం ఒక మాటగా నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించుకుని, ప్రతీ ఇంటికి గ్యాస్, నల్లా కనెక్షన్లు పొంది, ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉంది. ఇంటి పన్నుల వసూళ్లలో కూడా గ్రామస్థుల సహకారం మరువలేనిది.

నిధులు మంజూరు చేయాలి..

- కుక్కపల్లి నాగమణి, సర్పంచ్, రామన్నపాలెం



రామన్నపాలెంను ఓడీఎఫ్‌గా ప్రకటించడం సంతోషంగా ఉంది. పంచాయతీ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. గ్రామంలోని రామన్నపాలెం-కారాయిగూడెం రోడ్డు, రామన్నపాలెం-కందిమళ్ల వాగు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి. గ్రామాభివృద్ధికి సహకరించిన గ్రామస్థులకు, అధికారులకు కృతజ్ఞతలు.

క్రీడాభివృద్ధికి సహకారం

- రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఏసీపీ నరేష్‌రెడ్డి


బెలూన్లు ఎగురవేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి 2: క్రీడల అభివృద్ధికి పోలీస్‌శాఖ సహకారం అందిస్తుందని రూరల్ ఏసీపీ నరేష్‌రెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని పెవిలియన్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళలు బాస్కెట్‌బాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. తొలుత బాస్కెట్‌బాల్ కోచ్, మాజీ శాట్స్ డీడీ జుజ్జూరు సారయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పోటీలు నిర్వహించే ప్రాంగణానికి నిర్వాహకులు సారయ్య పేరు పెట్టారు. అనంతరం క్రీడాపతాకాన్ని ఎగురవేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా పోలీస్ ఉద్యోగాల్లో సత్తా చాటుతారని, క్రీడా కోటా ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని సూచించారు. బాస్కెట్‌బాల్ క్రీడా ప్రపంచం మొత్తం ప్రాచుర్యం ఉన్న క్రీడ అని, చిన్నతనం నుంచే ఈ క్రీడను అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నార్మన్ ఐసాక్, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎంవీ రమణ, వరంగల్ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ములంగి ప్రతాపరెడ్డి, నగర సీఐలు రాజిరెడ్డి, నాగేంద్రచారి, కార్పొరేటర్ నాగండ్ల దీపక్‌చౌదరి, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ పీవీ రమణ పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే..

పురుషుల విభాగంలో రంగారెడ్డిజిల్లా జట్టు నల్గొండ జట్టుపై 85-48 స్కోరు తేడాతో గెలుపొందింది. వరంగల్‌జట్టు నిజామాబాద్ జట్టుపై 71-46 స్కోరు తేడాతో విజయం సాధించారు. ఖమ్మంజట్టు మహబూబ్‌నగర్ జట్టుపై 46-43 స్కోరుతేడాతో విజయం సాధించింది.



మాట్లాడుతున్న ఏసీపీ నరేష్‌రెడ్డి


మ్యాచ్ కొనసాగుతున్న దృశ్యం

What do you do to start the slide show

Computer Awareness

1. Object Oriented Programming (OOP) is a _______philosophy:
a) Network b) Design
c) Data Type d) None of These

2. OOP uses a different set of programming languages than old procedural programming languages such as:
a) C b) Pascal c) Both of Above
d) None of These

3. One of the principal advantage of object oriented programming techniques over procedural programming techniques is that they enable programmers to create ______that do not need to be changed when a new type of object is added:
a) Networks b) Modules
c) Data Slates d) None

4. Which among the following definitions are correct:
a) Object - Any entity that has state and behavior is known as an object.
b) Class - Collection of objects is called class. It is logical entity.
c) Inheritance -When one object acquires all the properties and behaviors of parent object its know as inheritance. It provides code re-usability and is used to achieve run time polymorphism.
d) All of the above

5. Which one among the following is incorrect about 'class':
a) A class is simply a representation of the type of object.
b) It is blueprint or plan or template that describes the details of an object.
c) A class is the blue print from which the individual objects are created. It is composed of three things - a name, attributes and operations d) None of These

6. ______provides a powerful and natural mechanism for organizing and structuring your software. It also explains how classes inherit state and behavior from their super classes and explains how to derive one class from another using the simple syntax provided by the java programming language:
a) Object b) Inheritance
c) Class d) None of These

7. An _____ is a contract between a class and the outside world. When a class implements an interface, it promises to provide the behavior published by that ______:
a) Object b) Interface
c) Package d) None of These

8. A ____ is a namespace for organizing classes and interfaces in a logical manner. Placing your code into ______ makes large software projects easier to manage. This section explains whythis is useful and introduces you to the Application Programming Interface (API) provided by the Java Platform:
a) Inheritance b) Object
c) Package d) None of These

9. SRP stands for:
a) Server Responsibility Principle
b) Single Responsibility Principle
c) Standard Responsibility Principle
d) None of These

10. OCP stands for:
a) Open Closed Principle
b) Open Class Principle
c) Organized Closed Principle
d) None of These

11. LSP stands for:
a) Local Substitution Principle
b) Liskov Substitution Principle
c) Labeled Substitution Principle
d) None of These

12. DIP stands for:
a) Domain Inversion Principle
b) Diodic Inversion Principle
c) Dependency Inversion Principle
d) None of These

13. ISP stands for:
a) Interface Segregation Principle
b) Internet Segregation Principle
c) Informal Segregation Principle
d) None of These

14. OOP was practiced in the:
a) 1970s b) 1980s
c) 1960s d) None of These

15. Classic OOP - Object Oriented programming can be traced back to a language called Simula, and in particular Simula 67, which was popular during the _____:
a) 1930s b) 1960s
c) 1950s d) None of These

16. Full form of DOS:
a) Disk Operating System
b) Disk Operating Software



c) Digital Output System
d) None of These

17. DOS file names are restricted to:
a) 5 Characters
b) 6 Characters
c) 8 Characters
d) None of These

18. OLE stands for:
a) Operational Linking and Enabling
b) Object Linking and Enabling
c) Object Linking and Embedding
d) None of These

19. Which shows the name of file:
a) Title Bar b) Menu Bar
c) Standard Tool Bar
d) None of These

20. Open, Print and Save display on:
a) Menu Bar b) Standard Tool Bar
c) Title Bar d) None of These

21. Font type, Font size, Bold, Underline, Bullets, Alignment display on:
a) Menu Bar b) Formatting Tool Bar
c) Standard Tool Bar
d) None of These

22. Presentations made on:
a) MS Word b) MS Excel
c) MS Power Point
d) None of These

23. Slides prepares in:
a) MS Word b) MS Power Point
c) MS Excel d) None of These

24. Full form of DBMS:
a) Data Base Management System
b) Document Base Management System
c) Digital Base Management System
d) None of These

25. RDBMS means:
a) Relational Data Base Management System
b) Reliable Data Base Management System
c) Relational Document Base Management System d) None of These

26. Full form of WWW:
a) World Wire Web
b) World Wide Web
c) World Width Web
d) None of These

27. Full form of IP:
a) Internet Programming
b) Internet Protection
c) Internet Protocol
d) None of These

28. PPP stands for:
a) Point Power Protocol
b) Point to Point Protocol
c) Power Point Presentation
d) None of These

29. URL is:
a) Uniform Resource Locator
b) Universal Region Locator
c) Uninterrupted Resource Locator
d) None of These

30. KVM stands for:
a) Keyboard Verstality in Mouse
b) Keyboard, Video, Mouse
c) Keyboard, Video, Music
d) None of These

31. SAN refers to:
a) Storage Area Network
b) Sample Annual Numbers
c) Search Access Network
d) None of These

32. Full form of COMPUTER is:
a) Compulsory Operated Machine Privately Used for Technology Education and Research
b) Commonly Operated Machine Particularly Used for Technology Education and Research
c) Conveniently Operated Method Particularly Used for Technology Education and Research
d) None of These

33. COBOL is:
a) Common Business Oriented Language
b) Computer Basics in Other Language
c) Computer Business Oriented Language
d) None of These

34. Ctrl + A is for:
a) To Save b) To Select Whole Area
c) To Bold d) None of These

35. Ctrl + S is for:
a) To Italic b) To Redo
c) To Save d) None of These

36. SIM means:
a) Speed In Mobile
b) Special Identity Module
c) Subscriber Identity Module
d) None of These

37. CPU is:
a) Control Processing Unit
b) Computer Programming Unit
c) Central Processing Unit
d) None of These

38. Cable TV network is example of:
a) MAN b) LAN
c) VAN d) None of These

39. RAM stands for:
a) Read Access Memory
b) Random Access Memory
c) Rewritable Access Memory
d) None of These

40. ROM stands for:
a) Read Operating Memory
b) Random Oriented Memory
c) Read Only Memory
d) None of These

41. Which device connects LAN to Internet :
a) HTML b) Bridge
c) Router d) None of These

42. Sending an E-mail is similar to:
a) Drawing a Picture
b) Talking On the Phone
c) Writing a Letter
d) None of These

43. What do you do to start the slide show:
a) Click on Go
b) Click on Slide Show Icon
c) Turn on Transition d) None of These

44. To print the power point presentation, press:
a) Ctrl + K b) Ctrl + T
c) Ctrl + P d) None of These

45. Shortcut key for Subscript is:
a) Ctrl + = b) Ctrl + -
c) Ctrl + Shift + = d) None of These

46. Shortcut Key for Superscript is:
a) Ctrl + = b) Ctrl + -
c) Ctrl + Shift + = d) None of These

47. Shortcut Key for insert hyperlink in document is:
a) Ctrl + H b) Ctrl + K
c) Ctrl + L d) None of These

48. We can detect spelling and grammar error by:
a) Press Shift + F7 b) Press F7
c) Press Alt + F7 d) None of These

49. Shortcut Key for font dialog box is:
a) Ctrl + F b) Ctrl + G
c) Ctrl + D d) None of These

50. Shortcut Key for Find and Replace dialog box is:
a) Ctrl + H b) Ctrl + F
c) Both of Above d) None of These

- K.S.Padmavathi

Answers

1)b	11)b	21)b	31)a	41)c
2)c	12)c	22)c	32)b	42)c
3)b	13)a	23)b	33)a	43)b
4)d	14)b	24)a	34)b	44)c
5)e	15)b	25)a	35)c	45)a
6)b	16)a	26)b	36)c	46)c
7)b	17)c	27)c	37)c	47)b
8)c	18)c	28)b	38)a	48)b
9)b	19)a	29)a	39)b	49)c
10)a	20)b	30)b	40)c	50)a

అడ్మిషన్స్

నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పిటిఐ) పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీస్, పవర్ సిస్టమ్ ఆపరేషన్, ఎనర్జీ మార్కెట్ మేనేజ్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ & గ్రిడ్ ఇంటర్‌ఫేస్ టెక్నాలజీస్.
అర్హత: బిఇ/బిటెక్
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
చివరి తేదీ: 2018 జనవరి 15
వెబ్‌సైట్: http://npti.in/default.aspx

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) బీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత
వయోపరిమితి: 23 సంవత్సరాలు మించకూడదు
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఎంపిక: ప్రవేశ పరీక్ష ద్వారా
చివరి తేదీ: 2018 మార్చి 19
ప్రవేశపరీక్ష తేదీ: 2018 మే 5
వెబ్‌సైట్: http://admissions.tiss.edu

సహసంబంధ సూత్రానికి బలం చేకూర్చే పద్ధతి?

పాఠ్య ప్రణాళిక

1. ఏక కేంద్ర పద్ధతిలో లాభం
1) అన్ని పాఠ్యాంశాల మధ్య సహసబంధం ఉంటుంది
2) ఉన్నత పాఠశాలలకు అనుకూలం
3) మనో వైజ్ఞానికంగా తగినది
4) రుతువులకు అనుగుణంగా ఉంటుంది

2. శీర్షికా పద్ధతిలో లోపం
1) విషయాలు ఎక్కువ కాలం గుర్తుండవు
2) ప్రాథమిక తరగతులకు అనుకూలం కాదు
3) మనో వైజ్ఞానికంగా తగినది కాదు
4) పైవన్నీ

3. ఏక కేంద్ర పద్ధతిలో లోపం
1) మానసిక స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశాలు ప్రవేశపెడతారు
2) విద్యార్థికి విసుగు రావచ్చు
3) సమగ్ర జ్ఞానం, పూర్తి అవగాహన కలుగుతుంది
4) మనో వైజ్ఞానికంగా తగినది

4. శీర్షికా పద్ధతిలో లాభం?
1) విద్యార్థి మానసిక స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశాలు ప్రవేశ పెడతారు
2) ఒక విషయంపై పూర్తి అవగాహన ఏర్పడుతుంది
3) మనో వైజ్ఞానికంగా తగినది
4) విషయాలు ఎక్కువ కాలం గుర్తు ఉండవు

5. హంటర్ స్కోరు కార్డులో గరిష్ఠ గణనలు దేనికి కేటాయించారు?
1) మనో వైజ్ఞానిక ఆధారాలు
2) అభ్యసన అనుభవాలు
3) భాషా శైలి 4) విజయ జ్ఞానం

6. పాఠ్యపుస్తకం యాంత్రిక లక్షణం కానిది?
1) చేతిలో పట్టుకుని వెళ్లే పరిమాణంలో ఉండాలి
2) వాడిన కాగితం నాణ్యంగా ఉండాలి
3) ఆకర్షణీయమైన అట్ట, బైండింగ్ ఉండాలి
4) అక్షరాలు చిన్నవిగా సూక్ష్మంగా ఉండాలి

7. మనదేశ సంస్కృతీ సంప్రదాయాలను భద్రపరచి ముందు తరాలకు అందించే పాఠ్య ప్రణాళికా నిర్మాణ సూత్రం?
1) సమైక్యతా సూత్రం 2) కలుపబడి ఉంటే సూత్రం
3) పరిరక్షణ సూత్రం 4) ఉపయోగితా సూత్రం

8. కిందివాటిలో రచయిత లక్షణం?
1) మంచి విద్యార్హత, అనుభవం కలిగి ఉండాలి
2) విషయంపై పట్టు కలిగి ఉండాలి
3) మార్పులు చేర్పులు తెలుసుకొని ఉండాలి
4) పైవన్నీ

9. వస్తువులను సేకరించడం, సైన్స్ క్లబ్ కార్యక్రమాలు వంటి కృత్యాల్లో విద్యార్థులు పాల్గొనేలా అవకాశాన్ని కల్పించే జీవశాస్త్ర ప్రణాళికా సూత్రం?
1) ఉపయోగితా సూత్రం
2) సమైక్యతా సూత్రం
3) విద్యార్థి కేంద్రీకృత సూత్రం
4) విరామ సమయ సద్వినియోగ సూత్రం

10. నిర్దిష్టమైన పాఠ్య విషయాలను ఎన్నుకొని వాటి లోని మౌళిక విషయాలను కింది తరగతుల్లో, క్లిష్ట మైన విషయాల్లో, పై తరగతుల్లో చెప్పే విధానంలో తయారు చేసిన పాఠ్య ప్రణాళికా పద్ధతి?
1) అంశాల పద్ధతి 2) యూనిట్ పద్ధతి
3) భావన పద్ధతి 4) ఏక కేంద్రక పద్ధతి

11. హంటర్ స్కోరు కార్డులో తక్కువ గణనలు దేనికి కేటాయించారు?
1) రచయిత విద్యాస్థాయి 2) వెల, యాంత్రిక లక్షణాలు
3) ఉపాధ్యాయుని సహకారం 4) 1, 3

12. హంటర్ స్కోరు కార్డులో భాషా శైలికి కేటాయించిన గరిష్ఠ గణన?
1) 100 మార్కులు 2) 140 మార్కులు
3) 110 మార్కులు 4) 120 మార్కులు

13. హంటర్ స్కోరు కార్డులో మనో వైజ్ఞానిక ఆధారాలకి కేటాయించిన గరిష్ఠ గణన?
1) 1200 మార్కులు 2) 300 మార్కులు
3) 250 మార్కులు 4) 350 మార్కులు

14. హంటర్ స్కోరు కార్డులో వెల, యాంత్రిక లక్షణాలకి కేటాయించిన గరిష్ఠ గణన?
1) 100 మార్కులు 2) 150 మార్కులు
3) 200 మార్కులు 4) 50 మార్కులు

15. హంటర్ స్కోరు కార్డులో ఉపాధ్యాయుని సహకారానికి కేటాయించిన గరిష్ఠ గణన?
1) 40 మార్కులు 2) 100 మార్కులు
3) 150 మార్కులు 4) 50 మార్కులు

16. సహసంబంధ సూత్రానికి బలం చేకూర్చే పద్ధతి?
1) చారిత్రక పద్ధతి 2) భావనల పద్ధతి
3) శాఖాంతర పద్ధతి 4) యూనిట్ పద్ధతి

17. శాస్త్ర సత్యాల ఆవిష్కరణలో మలుపులు, శాస్త్రవేత్తల కృషి ఏ పాఠ్య ప్రణాళిక నిర్మాణ పద్ధతి ద్వారా తెలుస్తుంది?
1) చారిత్రక 2) శీర్షిక
3) ఏక కేంద్ర 4) శాఖాంతర

18. శీర్షిక పద్ధతి ఏ సైకాలజి సిద్ధాంతంపై ఆధారపడి తయారు చేశారు?
1) థార్న్‌డైక్ యత్నదోష సిద్ధాంతం
2) థార్న్‌డైక్ అభ్యసన సిద్ధాంతం
3) గెస్టాల్ట్ వాదం
4) బ్రూనర్ శిక్షణ సిద్ధాంతం

టిఆర్‌టి - 2017



19. జీవ పరిణామం అనే పాఠాన్ని 9వ తరగతిలో ప్రవేశపెట్టి అక్కడే పూర్తి చేశారు. అయితే అది ఏ పాఠ్య ప్రణాళిక నిర్మాణ పద్ధతి?
1) శీర్షిక 2) ఏకకేంద్ర
3) రుతుక్రమ 4) సమైక్య పద్ధతి

20. మనం పీల్చే గాలి అనే పాఠాన్ని 3వ తరగతిలో ప్రవేశపెట్టి 4, 5, 6, 7 తరగతుల్లో చేశారు? అయితే అది ఏ పాఠ్యప్రణాళిక నిర్మాణ పద్ధతి?
1) శీర్షిక 2) ఏక కేంద్ర
3) రుతు క్రమ 4) సమైక్య

21. కన్ను పనిచేసే విధానాన్ని, కెమెరా పనిచేసే విధానంతో పోల్చి చెప్పడం ఏ పాఠ్యప్రణాళిక నిర్మాణ పద్ధతి?
1) శీర్షిక 2) ఏక కేంద్రక
3) రుతు క్రమ 4) సమైక్య

22. విద్యార్థుల్లో వివిధ ప్రక్రియా నైపుణ్యాలను పెంపొందింపచేసే పద్ధతి?
1) భావన 2) ప్రక్రియ
3) శాఖాంతర 4) శీర్షిక

23. విజ్ఞాన శాస్త్ర బోధన ఉద్దేశాల్లో ముఖ్యమైనది 'శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం'. దీనిని పెంపొందింప చేసే పద్ధతి ఏది?
1) భావన 2) ప్రక్రియ
3) శాఖాంతర 4) శీర్షిక

24. విద్యార్థిని అన్వేషకుడి స్థానంలో ఉంచి శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇచ్చే పాఠ్య ప్రణాళిక నిర్మాణ పద్ధతి?
1) భావన 2) ప్రక్రియ
3) శాఖాంతర 4) శీర్షిక

25. COPES ముఖ్య ఉద్దేశం?
1) విద్యార్థి ప్రక్రియలో శిక్షణ ఇవ్వడం
2) మౌళిక భావనలను పెంపొందించడం
3) 1, 3 4) విద్యార్థి జ్ఞానాన్ని అందించడం

26. విషయానికి ప్రాధాన్యం ఇవ్వని పాఠ్యప్రణాళిక నిర్మాణ పద్ధతి?
1) శీర్షిక పద్ధతి 2) ఏక కేంద్రక పద్ధతి
3) సమైక్య పద్ధతి 4) ప్రక్రియ పద్ధతి

27. కరేల్ అనేది ఏ భాషకు చెందిన పదం?
1) లాటిన్ 2) గ్రీక్
3) ఫ్రెంచ్ 4) ఆంగ్లం

28. పాఠ్య ప్రణాళిక... విషయం, వనరులు, సామగ్రి, బోధన పద్ధతులు కలిగిన ఒక సంపూర్ణ ఛాయా సామర్థ్యం అని అన్నది?
1) ఎన్ఎస్ఎస్ఇ ఇయర్ బుక్(1960)
2) వెన్నింగ్ హామ్ 3) హిరస్ట్, పీటర్స్
4) స్పియర్స్

29. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించే కృత్యాల సముదాయమే విద్యా ప్రణాళిక అన్నది?
1) ఎన్ఎస్ఎస్ఇ ఇయర్ బుక్ 1960
2) వెన్నింగ్ హామ్
3) హిరస్ట్, పీటర్స్ 4) స్పియర్స్

30 'పాఠ్య పుస్తకం బోధనకు ఉపకరించే పుస్తకం' అని అన్నది?
1) సింప్సన్ 2) గూడ్స్ విద్యా డిక్షనరీ
3) కొఠారి కమిషన్ 4) వాగేల్

31. పాఠశాల అనే స్టూడియోలో తన అభిరుచికి అనుగుణంగా మెటీరియల్‌ను మలచడానికి కళాకారుడు ఉపయోగించే సాధనమే కరికులమ్ అని అన్నది?
1) ఎన్ఎస్ఎస్ఇ ఇయర్ బుక్ 1960
2) కన్నింగ్ హామ్ 3) హిరస్ట్, పీటర్స్
4) స్పియర్స్

32. పాఠ్యప్రణాళికను రూపొందించేటప్పుడు అభ్యాసకుని స్వభావం, విషయ స్వభావం, సమాజ స్వభావాన్నే దృష్టిలోకి తీసుకోవాలి అని అన్నది?
1) హిరస్ట్, పీటర్స్ 2) కన్నింగ్ హామ్
3) జాకబ్ సన్ 4) ఎడ్వర్ట్ విక్టర్

33. విద్యా ప్రణాళికలో పొందుపరచాల్సిన 10 మౌళిక అంశాలను పేర్కొన్నది?
1) కొఠారి కమిషన్ 2) సెకండరీ విద్యా కమిషన్
3) జాతీయ విద్యా విధానం-1986
4) ఈశ్వరీభాయి పటేల్ కమిటీ-1977

34. జాతీయ విద్యా విధానం(1986) ప్రకారం పాఠ్య ప్రణాళికలో 10 మౌళిక అంశాల్లో లేని విషయం?
1) పరిసరాల పరిరక్షణ 2) శాస్త్రీయ దృక్పథం
3) సామాజిక వనరుల సద్వినియోగం
4) చిన్న కుటుంబ భావన

35. 1986 జాతీయ విద్యా విధానం సూచన మేరకు దేశ, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఎంతెంత శాతం ఉండాలి?
1) 80, 20 2) 20, 80
3) 70, 30 4) 50, 50

36. ఉత్తమ పాఠ్యగ్రంథ రచయితకు సంబంధిత సబ్జెక్టును బోధించడంలో కనీసం ఎన్ని సంవత్సరాల అనుభవం ఉండాలి?
1) 3 2) 5 3) 7 4) 10

37. విద్యా ప్రణాళిక శిశు కేంద్రీకృతంగా ఉండాలని, పరీక్షా విధానంలో సంస్కరణలు తేవాలని సూచించింది?
1) కొఠారి కమిషన్
2) మాధ్యమిక విద్యా కమిషన్
3) జాతీయ విద్యా విధానం-1986
4) ఈశ్వరీ భాయి పటేల్ కమిటీ

38. చేయడం ద్వారా నేర్చుకోవడం అనే సూత్రానికి పాఠ్య ప్రణాళిక ప్రాధాన్యత ఇవ్వడం?
1) కృత్య కేంద్రీకృత సూత్రం
2) సమైక్యతా సూత్రం
3) అనుభవ సామర్థ్యం సూత్రం
4) వ్యవస్థీకరణ సూత్రం

39. సమాజ సంప్రదాయాలను, సంస్కృతిని పరీక్షించి తరవాత తరానికి అందించే విధంగా పాఠ్యప్రణాళిక ఉండటం?
1) దూరదృష్టి సూత్రం 2) వ్యవస్థీకరణ సూత్రం
3) పరిరక్షణ సూత్రం 4) సృజనాత్మక సూత్రం

40. ప్రాథమిక ప్రణాళిక భావి జీవితానికి అవసరమైన తర్ఫీదును ఇవ్వడం అనేది?
1) అనుభవ సామర్థ్య సూత్రం
2) వ్యవస్థీకరణ సూత్రం
3) దూరదృష్టి సూత్రం
4) పరిరక్షణ సూత్రం



ఎ.వెంకటస్వామి
సీనియర్ ఫ్యాకల్టీ

41. ప్రాథమిక స్థాయి నుంచి మాధ్యమిక, ఉన్నతస్థాయి వరకు తగిన క్రమ సంధానాన్ని ఏర్పరుస్తూ పాఠ్యప్రణాళిక విషయాల కూర్పు, క్రమం ఉండటం?
1) వ్యవస్థీకరణ సూత్రం
2) అనుభవ సామర్థ్య సూత్రం
3) మార్పునకు అనువుగా ఉండటం
4) ఏదీ కాదు

42. వరుసగా కొన్ని సంవత్సరాలు ఒకే పాఠ్యాంశాన్ని అధ్యయనం చేసే పద్ధతులు?
1) శీర్షిక విధానం 2) ఏక కేంద్ర పద్ధతి
3) సమైక్య పద్ధతి 4) ప్రక్రియా పద్ధతి

43. 1962-68 అమెరికా అమలు చేసిన (SAPA) Science A Process Approach ఏ పద్ధతికి ఉదాహరణ?
1) ఏక కేంద్ర 2) చారిత్రక
3) ప్రక్రియ 4) శీర్షిక

44.అమెరికాలో ప్రవేశపెట్టిన(1969)లో COPES ఏ పద్ధతికి ఆధారం?
1) ప్రక్రియ పద్ధతి 2) భావన పద్ధతి
3) యూనిట్ పద్ధతి 4) సమైక్య పద్ధతి

45. జీవశాస్త్ర బోధన శాస్త్రీయంగా, ప్రతిభావంతంగా, కచ్చితంగా జరగడానికి తోడ్పడే పద్ధతి?
1) ప్రక్రియ పద్ధతి 2) భావనా పద్ధతి
3) యూనిట్ పద్ధతి 4) శాఖాంతర పద్ధతి

46. గాంధీజీ ప్రతిపాదించిన బేసిక్ విధానంలోని మూల సూత్రం సహ సంబంధం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
1) ఏక కేంద్ర పద్ధతి 2) భావన పద్ధతి
3) శాఖాంతర పద్ధతి 4) ప్రక్రియ పద్ధతి

47. ఏ అంశాన్ని తెలుసుకోకపోతే మరొక అంశం సరిగా అవగాహన చేసుకోవడం సాధ్యం కాదో, ఆ అంశాన్నే మొదట చేర్చి దాని జ్ఞానం ఆధారంతో నేర్చుకోదగిన అంశాన్నే తరవాత అమర్చడం?
1) భావన పద్ధతి 2) ఏక కేంద్ర పద్ధతి
3) తార్కి పద్ధతి 4) చారిత్రక పద్ధతి

48. సరళం నుంచి సంక్లిష్టానికి, తెలిసిన విషయాన్నుంచి తెలియని విషయానికి మూర్త విషయాల నుంచి అమూర్త విషయాలకు అమర్చే పద్ధతి?
1) భావన పద్ధతి 2) తార్కిక పద్ధతి
3) యూనిట్ పద్ధతి 4) చారిత్రక పద్ధతి

49. రుతువులను, మాసాలను అనుసరించే, ఆయా కాలాల్లో అప్పుడు లభించే వృక్ష, జంతు, జాలాలు వాటి జీవన క్రియల ఆధారంగా పాఠ్య ప్రణాళికను తయారు చేసే పద్ధతి?
1) తార్కిక క్రమ పద్ధతి 2) చారిత్రక పద్ధతి
3) భావన పద్ధతి 4) రుతుక్రమ పద్ధతి

50. పాఠ్యపుస్తకం అనేది ముద్రిత రూపంలో ఉండి తరగతి గదిలో ఉపయోగించే మౌళిక బోధనోపకరణం, మొత్తం తరగతికి ఉపయోగపడుతుంది అని అన్నది?
1) సింప్సన్ 2) గూడ్స్ విద్యా డిక్షనరీ
3) కొఠారి కమిషన్ 4) వాగేల్

సమాధానాలు

1) 3	12) 3	23) 2	34) 3	45) 1
2) 4	13) 2	24) 2	35) 1	46) 2
3) 2	14) 1	25) 2	36) 2	47) 3
4) 2	15) 4	26) 4	37) 3	48) 2
5) 1	16) 3	27) 1	38) 1	49) 4
6) 4	17) 1	28) 1	39) 3	50) 1
7) 3	18) 3	29) 4	40) 3	
8) 4	19) 1	30) 2	41) 1	
9) 4	20) 2	31) 2	42) 2	
10) 4	21) 4	32) 3	43) 3	
11) 4	22) 2	33) 3	44) 2	

అవీ..ఇవీ

నేడు ఇఫ్టూ ధర్నా

ఇల్లెందుటౌన్,జనవరి2: సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనాలు చెల్లించాలని బుధవారం జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఇల్లెందు బ్రాంచ్ అధ్యక్ష,కార్యదర్శులు ఎస్కే. యాకూబ్షావలీ, కొండపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఈ ఆందోళనలకు కాంట్రాక్ట్ కార్మికులు తరలిరావాలని మంగళవారం జరిగిన సమావేశంలో కోరారు.

ఆర్సీహెచ్పీ ఉద్యోగులకు బహుమతి

కొత్తగూడెంఅర్బన్, జనవరి2: ఆర్సీహెచ్పీ ఉద్యోగులు డిసెంబరులో కష్టపడి పనిచేసి 238 రేకులు అధిక మొత్తంలో బొగ్గు రవాణా సరఫరా చేసినందుకు సింగరేణి సీఅండ్ఎండి ఎన్.శ్రీధర్ ఉద్యోగులను మంగళవారం అభినందించారు. ముమ్మందు సరికొత్త మైలురాయిలను నెలకొల్పాలని కోరుతూ లక్షరూపాయల నగదు బహుమతి ఆర్సీహెచ్పీ ఉద్యోగులకు ప్రకటించారు. సహాకరించిన ఆర్సీహెచ్పీ కార్మికులను, సూపర్వైజర్లను, అధికారులు, యూనియన్లను, ఏరియా అధికారులను సీఅండ్ఎండీ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ కొత్తగూడెం ఏరియాకి నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు.

లంబాడాల ఎస్టీహోదాను రద్దుచేసే వరకూ పోరాటం

ఏటీఎఫ్, తుడుందెబ్బ, ఏఎస్యూ నేతల హెచ్చరిక

టేకులపల్లి, జనవరి 2: రాష్ట్రంలో లంబాడాల ఎస్టీ హోదాను రద్దుచేసే వరకు పోరాటాలను కొనస్తామని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(ఏటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కుర్సం రామారావు, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్, ఏఎస్యూ ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని లచ్చగూడెం సమీపంలోని తోటలో మంగళవారం ఏటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాయం ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, ఏటీఎఫ్ సంఘాల జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. భారత రాజ్యాంగంలో 342ఆర్టికల్ ప్రకారం క్లాస్1 ప్రకారం లంబాడాలు ఎస్టీ జాబితాలో 1976 లో చేర్చబడలేదని, వీటికి సంభందించిన ఎలాంటి ఆధారాలు లేవన్నారు. లంబాడాలు అక్రమ మార్గంలో 41ఏళ్ళుగా రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తూ, అసలైన ఆదివాసీ తెగలకు దక్కకుండా చేస్తున్నారన్నారు. 1974 సంవత్సరంలో లంబాడాలు బీసీ-ఏ లోనిసీరియల్ నంబర్-13లో కొనసాగుతున్నారన్నారు. వీరు ఎలాంటి ఆధారాలు లేకుండా ఎస్టీ ఫలాలు పొందుతున్నారానార్నరు. అనంతరం ఖమ్మం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లాల తుడుందెబ్బ జిల్లా కమి టీలను ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఏటీఎఫ్ రాష్ట్ర అసోషియేట్ కార్యదర్శి మోకాళ్ళ శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పూనెం వీరభద్రం, ఇల్లెందు మున్సిపాల్టీ మాజీ అధ్యక్షురాలు అనసూర్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు,ఆదివాసీ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోల్యార్డు కాలుష్యం నుంచి కాపాడండి

రైల్వే, సింగరేణి అధికారులకు సమీప గ్రామస్థుల వినతి

టేకులపల్లి, జనవరి 2: మండలంలోని తడికలపూడి రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన కోల్యార్డు వల్ల తడికలపూడి పంచాయితీలోని తావుర్యాతండా, ఈర్యాతండా గ్రామాల ప్రజలు కాలుష్యం భారీన పడుతున్నామని, కాలుష్యం బారీ నుంచి కాపాడాలని పేర్కొంటు మంగళవారం కోల్యార్డును పరిశీలించటానికి వచ్చిన రైల్వే ఎస్వో మణికుమార్, సింగరేణి కోల్బ్రాంచి అధికారి నజీర్పాష, ఇల్లెందు సీఎస్పీ డీఈ రవిలకు జడ్పీటీసీ లక్కినేని సురేందర్రావు ఆద్వర్యంలో గ్రామస్థులు వినతిపత్రం అందచేశారు. బొగ్గు కాలుష్యంనుంచి తమను కాపాడాలని ఆ గ్రామాల ప్రజలు ఆ వినతిలో కోరారు. గత దశాబ్దాల కాలం నుంచి రైల్వే స్టేషన్ సమీపంలోని గ్రామాల్లో నివసిస్తున్నామని, కోయగూడెం ఓపెన్కాస్ట్ ప్రాజెక్టు నుంచి తడికలపూడి రైల్వేస్టేషన్ సమీపంలోని కోల్యార్డుకు సింగరేణి సంస్థ నిత్యం బొగ్గు రవాణ చేయడం వల్ల బొగ్గు కాలుష్యంతో గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వందలాది గిరిజనుల కుటుంబాల స్థితిగతులను ఆలోచించాలని, ఏజన్సీలో గిరిజన చట్టాలను అమలు పరచి తమకు న్యాయం చేయాలని ఆ వినతిలో గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



అధికారులకు వినతి పత్రం అందచేస్తున్న కోల్యార్డు ప్రభావిత గ్రామాల ప్రజలు

విద్యుత్శాఖలో లైన్మెన్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

పోస్టాఫీస్ సెంటరు, జనవరి2: విద్యుత్శాఖలో జూనియర్ లైన్మెన్ ఉద్యోగాల కోసం ట్రాన్స్కో విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వార పరీక్షకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అంబేద్కర్ ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ వెలన్కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5నుంచి ప్రారంభమయ్యే ఉచిత శిక్షణలో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు అభ్యర్థులకు రాత పరీక్షపై అవగాహన విద్యుత్ స్తంభాలు ఎక్కడం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని సూచించారు. ఆసక్తి గల వారు పాస్పోర్టుసైజ్ఫొటో, ఐటీఐ ధృవీకరణపత్రాన్ని అంబేద్కర్ ఐటీఐలో అందించాలని కోరారు. పూర్తి వివరాలకు 9949737369, 8919393964 సెల్నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

జెన్కో ప్రాజెక్టు డైరెక్టర్ రాధాకృష్ణ



కేక్ కట్ చేస్తున్న జెన్కో డైరెక్టర్ రాధాకృష్ణ

పాల్వంచ,జనవరి2: ప్రభుత్వం రైతులకు నిరంతరం విద్యుత్ ఇస్తున్నందున విద్యుత్ కార్మికులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని తెలంగాణ జెన్కో ప్రాజెక్టు డైరెక్టర్ రీధాకృష్ణ పిలుపునిచ్చారు. పాల్వంచలోని కేటీపీఎస్లో తెలంగాణ మ౦వాళా ఇంజనీర్ల నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచానికి విద్యుత్ అవసరం ఎంతో ఉందని కరంటు లేకపోతే ఒక్క క్షణం కూడా ఉండలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారని వారికి ఎల్లప్పుడూ విద్యుత్ను అందించేందుకు కార్మికుల సహకారం అవసరమన్నారు. అందుకే ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు ఒక ఇంక్రిమెంట్ను ఇచ్చిందని గుర్తుచేసారు. కార్యక్రమంలో కేటీపీఎస్ ఓఅండ్ఎం చీఫ్ ఇంజనీర్ జాటోత్ సమ్మయ్య, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

పాల్వంచలోని కేటీపీఎస్ కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో మంగళవారం జెన్కో ప్రాజెక్టు డైరెక్టర్ సీ రాధాకృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. డైరెక్టర్కు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

సింగరేణి నిర్వాసిత గ్రామంలో.. ఉచిత ఫ్యాబ్రిక్ పెయింట్ంగ్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరం ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఉమ

మణుగూరురూరల్, జనవరి2: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో సమితిసింగారం పంచాయతీ పరిధిలోని నిర్వాసిత కొత్త పద్మగూడెం గ్రామంలో మహిళలకు ఉచిత ఫ్యాబ్రిక్ పెయింట్ంగ్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాన్ని మంగళవారం సేవా అధ్యక్షురాలు చిలుకూరి ఉమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడారు. ఉచిత వృత్తి శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియెగ పర్చుకుని ఆర్థిక స్వావలంభనదిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇప్పటికే సేవా అధ్యర్యంలో ఏరియాలో టైలరింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్, డిటిపిలతో పటు పలు వృత్తి శిక్షణ కోర్సులలో ఉచితంగా శిక్షణనిచ్చినట్లు పేర్కొన్నారు. ఫ్యాబ్రిక్ పెయింట్ంగ్లో శ్రద్ధగా శిక్షణ పొందితే.. ఆసక్తి గల వారికోసం మరికొన్ని వృత్తి కోర్సులలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ రేవు సీతారాం, ఏస్టేట్ అధికారిణి ఉషాశ్రీ, స్పోర్ట్స్ సూపర్వైజర్ జాన్వెస్లీ, సేవా సభ్యులు షాకీరా, జమీలాబేగం, జె ఉషాజ్యోతి, సిహెచ్ సంధ్య, ఎస్డి నాజర్పాషా, గ్రామస్థులు వీరయ్య, పూనెం శ్రీను, వట్టం సీతారాములు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి..

డీఎంహెచ్వో దయానందస్వామి

పాల్వంచ టౌన్, జనవరి 2: మారుతున్న కాలంతోపాటు వేగంగా విస్తరిస్తున్న టెక్నాలజీపై పట్టు సాధించి టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని డీఎంఅండ్హెచ్వో డాక్టర్ కే.దయానందస్వామి అన్నారు. మంగళవారం డీఎంఅండ్హెచ్వో కార్యాలయంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ ఫోరం క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర్చుకోవడంతోనే ఏదైన సాధ్యమవుతుందని, ఉద్యోగులు ఇప్పటికైన నిరాశక్తతను వదిలి కంప్యూటర్ పరిజ్ఞానంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. దానిద్వార సేవలను ఎప్పటికప్పుడు అప్డేట్చేసే అవకాశం లభిస్తుందన్నారు. సమష్టి కృషితోనే ఏదైన సాధ్యపడుతుందని జిల్లాలోని వైద్యసిబ్బంది అందించే సేవలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు వారికి సంబంధించిన కార్యాలయ పనులను వెంటనే అందించాలని పేర్కొన్నారు. దీంతోపాటు అన్ని పీహెచ్సీల పరిధిలో సిబ్బంది సమన్వయంతో పని చేసి జిల్లాలోనే శాఖకు మంచిపేరు తీసుకురావాలని పేర్కొన్నారు. సమస్యలు ఏవైన ఉన్న తమ యూనియన్ నాయకులతో ఎప్పటికప్పుడు పరిష్కారానికి సిద్ధంగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంఅండ్హెచ్వో సువర్ణ, జిల్లా ఆర్బీఎస్కే కో-ఆర్డినేటర్ డాక్టర్ పోటు వినోద్, ఎవో, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాంకుమార్, లెప్రసీ, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ భాస్కర్, కార్యాలయ ఎకౌంట్ విభాగం సూపరింటెండెంట్ కృష్ణారావు, ఎస్టాబిలెష్ సూపరింటెండెంట్ చక్రపాణి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు చల్లగుండ్ల నాగేశ్వరరావు, డెమో చంద్రశేఖర్, మినిస్టీరియల్ జిల్లా ఉద్యోగుల సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్హెచ్వో

మోటార్ కార్మికుల వేతన ఒప్పందం చేయాలి

ఇల్లెందుటౌన్,జనవరి2: మోటార్ కార్మికులకు వేతనఒప్పందం చేయాలని ఇఫ్టూ ఇల్లెందు బ్రాంచ్ అధ్యక్షుడు పాయం వెంకన్న కార్యదర్శి యాకూబ్షావలీలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో మోటార్కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముకుందాపురం ఏరియాలో లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచేందుకు సుముఖంగా లేకుండా నాన్చుడు వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు లేక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వారిపనికితగ్గ వేతనాలు లేవని ఇప్పటికైనా వాతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరాటి వెంకన్న, ఉపసర్పంచ్ మండ దుర్గారావు, కోటయ్య, బుచ్చయ్య, అక్బర్, దేవ, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినికి ఎస్ఐ దంపతుల చేయూత



ములకలపల్లి, జనవరి 2: ములకలపల్లిలోని జడ్పీఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గిరిజన పేద విద్యార్థిని బీబినేని నాగమణికి భద్రాచలం పట్టణ ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న బి.హరిసింగ్ దంపతులు చేయూతనిచ్చారు. హరిసింగ్ భార్య అనురాధ పని చేసే పాఠశాలలో మంగళవారం నాగమణికి దుస్తులు, స్కూల్‌బ్యాగు, పుస్తకాలు, రూ. 500 నగదు అందజేశారు. హెచ్ఎం నందివీరభద్రం పాల్గొన్నారు.

మెట్ట రైతులకూ రాయితీ ట్రాక్టర్లు ఇవ్వండి

ముఖ్యమంత్రి పర్యటనలో ఓ రైతుకు మాట్లాడే అవకాశం

సమస్యలపై నివేదిక ఇవ్వండి: ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

దమ్మపేట, జనవరి 2: మగాణి రైతులతో పాటు మెరక రైతులకు రాయతీ ట్రాక్టర్లు ఇవ్వాలని పామాయిల్ రైతు సంక్షేమ సంఘం నాయకులు అశ్వారావుపేట ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లును కోరారు. మండలపల్లిలో నిర్మాణంలో ఉన్న ఆయన స్వగృహంలో రైతులు తాటిని కలసి ఆయన్ను సత్కరించి అనంతరం వినతిపత్రం అందజేశారు. పామాయిల్ తోటల్లో విద్యుత్ లైన్ల మార్పిడిని రుసుము లేకుండా ఉచితంగా చేయాలని, వర్మికంపోష్టు తయారీకి ప్లాస్టిక్ తొట్టెలను ఇవ్వాలని కోరారు. దీనిపై తాటి స్పందిస్తూ ముఖ్యమంత్రి పర్యటన నాటికి రైతులంతా చర్చించుకుని తనకు నివేదికనిస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. ముఖ్యమంత్రి సభలో ఒక రైతుకు మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. తాటిని కలిసిన వారిలో ఆత్మచైర్మన్ కే.వి.సత్యనారాయణ, దారా తాతారావు, జూపల్లి రమణ రావు, పోతినేని శ్రీరామవెంకటరావు, సుంకవల్లి వీరభద్ర రావు, శీమకర్తి వెంకటేశ్వరరావు, కొల్లి వెంకటరమణ, పానుగంటి రాంబాబు, యార్లగడ్డ బాబు, గోరే ఉన్నారు.

ముకమామిడి ప్రాజెక్టు పరిశీలన

ములకలపల్లి: మండల పరిధిలోని మూకమామిడి ప్రాజెక్టును మంగళవారం ట్రైకార్ చైర్మన్, ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రాజెక్టు తూములు, కాల్వలు, షీట్లులను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇటీవల మంజూరైన రూ.9. 14కోట్ల తో ప్రాజెక్టు మరమ్మతు పనులు ఈ నెలాఖరునాటికి ప్రారంభమవుతాయన్నారు. మంత్రి తుమ్మల, ఎంపీ పొంగులేటి కృషితోనే నిధులు మంజూరయ్యాయని, ప్రాజెక్టును పరిశీలించేందుకు మంత్రి హరీష్‌రావును తీసుకొస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ములకలపల్లి గ్రామసర్పంచ్ కీసరి లక్ష్మి, దమ్మపేట ఏఎంసీ చైర్మన్ తానం లక్ష్మి, ఐబీఎఈ శ్రీకుమార్, ఆయకట్టు రైతులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

సంక్షిప్తంగా..

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కనకదుర్గ

అన్నపురెడ్డిపల్లి, జనవరి2: అన్నపురెడ్డిపల్లి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కనకదుర్గను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్థానిక తహసీల్దార్‌గా పని చేస్తున్న మాలతి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడంతో చంద్రుగొండ మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న కనకదుర్గకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

భూరికార్డుల ప్రక్షాళన పూర్తి

చంద్రుగొండ, జనవరి2: ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన ప్రక్రియ చంద్రుగొండ మండలంలో పూర్తయినట్లు తహసీల్దార్ కనకదుర్గ తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ మండలంలో 36,848 ఎకరాల భూవిస్తీర్ణం ఉందన్నారు. 915ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు.

రైతులకు రుణాలివ్వాలి: సీపీఎం

ములకలపల్లి, జనవరి2: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) ద్వారా రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సీపీఎం మండల నాయకులు మాలోత్ రావూజా డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీటీసీ రవికుమార్, పద్మావతి, సీత, మహాలక్ష్మి, కట్టం లక్ష్మి పాల్గొన్నారు.

'ఈ పాస్‌తోనే ఎరువులు విక్రయించాలి'

ములకలపల్లి, జనవరి 2: ఎరువుల క్రయవిక్రయాలు ఈపాస్ మిషన్ ద్వార మాత్రమే నిర్వహించాలని ఏవో ఎ. కరుణామై పెర్టిలైజర్స్ యజమానులకు సూచించారు. మంగళవారం ఆమె ములకలపల్లిలోని ఓ ఎరువుల షాపులో ఈపాస్‌తో ఎరువుల విక్రయాలను పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అశ్వారావుపేట రూరల్, జనవరి2: మండలంలోని బచ్చువారిగూడెం పంచాయతీ, వాగొడ్డుగూడెం గ్రామానికి చెందిన బి.వీరాస్వామి అనేవ్యక్తి మంగళవారం ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట వస్తున్న క్రమంలో నారాయణపురం లోతువాగు చెరువు వద్ద అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ వీరస్వామిని స్థానికులు వినాయకపురం ఆసుపత్రికి తరలించారు.

'వందశాతం దొడ్లు నిర్మించుకోవాలి'

అశ్వారావుపేట రూరల్, జనవరి 2: పంచాయతీలో వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం జరిగేలా చూడాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచి తెల్లం వీరకుమారి, కార్యదర్శి గోపి మహదేవ్ కోరారు. మండలంలోని ఊట్లపల్లిలో మంగళవారం పంచాయతీ గ్రామసభను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఉపసర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలతోనే నిరుద్యోగం

● ఎన్డీ రాష్ట్ర నాయకుడు రంగారెడ్డి

అశ్వారావుపేట, జనవరి 2: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజు రోజుకు నిరుద్యోగం, పేదరికం పెరుగుతోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెచ్చల రంగారెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఎన్డీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. యువత అన్నివర్గ ధోరణలను విడనాడి ఉద్యమించాలన్నారు. పాలకులు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు విస్మరించారని దుయ్యబట్టారు. చాలా మంది కమ్యూనిస్టులు దేశ కోసం తమ ప్రాణాలను త్యాగంచేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఏ రాము, జి. ప్రభాకర్, ఎస్ రామారావు, వి. లక్ష్మణ్, కల్లయ్య, బాడిస లక్ష్మణరావు, కుంజా అర్జున్, కంగాల వెంకటేశ్, కారం మల్లేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెచ్చల రంగారెడ్డి

సావిత్రీబాయి పూలే అవార్డుకు

వేదగణిత నిపుణుడు రామారావు ఎంపిక

దమ్మపేట, జనవరి 2: సావిత్రి బాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డుకు వేదగణిత నిపుణుడు రాజులపూడి రామారావు ఎంపిక య్యారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చే వారికి ఈ అవార్డును సంఘం ఆధ్వర్యంలో అందజేస్తారు. దమ్మపేట మండల పరిధిలో శ్రీరామపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే రామారావు వేదగణితంలో 4,5వ తరగతి విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు. తర్ఫీదుపొందిన విద్యార్థులతో చుట్టుపక్కల పాఠశాలలో విద్యార్థులకు మెలుకువలు నేర్పుతూ గణితంపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. దీనికిగాను జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న రామారావుకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.



రామారావును సన్మానిస్తున్న జేసీ రాంకిషన్(ఫైల్)

పాసు పుస్తకాల పంపిణీకి సిద్ధంగా ఉండాలి

అశ్వారావుపేట టౌన్, జనవరి1: ప్రభుత్వం 29నుంచి రైతులకు అందించనున్న కొత్త పాసు పుస్తకాల పంపిణీకి అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం అధికారులతో సమావేశం నిర్వ హించి సూచనలు చేశారు. డీపీ విల్సన్, సుమతి, సూర్యనారాయణ, పాల్గొన్నారు.

5న ట్రైకార్ ఇంటర్వ్యూలు

ములకలపల్లి, జనవరి 2: మండల పరిషత్ కార్యాలయంలో 5న ట్రైకార్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఈవోఆర్డీ విజయభారతి మంగళవారం తెలిపారు.

'సేవా దృక్పథం పెరగాలి'

అశ్వారావుపేట టౌన్, జనవరి 2: స్వచ్ఛంద సంస్థలతోపాటు ప్రజల్లోనూ సేవా దృక్పథం పెరగాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ అబ్బయ్య సూచించారు. స్థానిక కెమిలాయిడ్స్ సహకారంతో స్థానిక పరిశ్రమ ప్రాంగణంలో పేరాయిగూడెం పంచాయతీలో ఏర్పాటు చేసేందుకు రూ.70వేల విలువైన 35 ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లను మంగళవారం సర్పంచ్ నార్లపాటి సత్యావతికి అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ వేలూరి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ మేనేజర్ వేణుగోపాల్, ఉపసర్పంచ్ హరిబాబు, పాల్గొన్నారు.



సర్పంచ్‌కు ఎల్ఈడీ లైట్లను అందజేస్తున్న సీఐ

అశ్వారావుపేట రూరల్, జనవరి02: వినాయకపురం పీహెచ్‌సీలో పనిచేస్తున్న సీహెచ్‌వో రేణుకా దేవి కుమార్తె పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. హెచ్ఎం బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యు డు ప్రసాద్ 30మంది చిన్నారులకు అందించారు.

ప్రభుత్వ విద్యావిధానాన్ని..

నిర్వీర్యం చేసేందుకే నిర్ణయం

ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నిర్ణయించకుండా.. ముందుగా అడ్మిషన్లు భర్తీచేసుకునేందుకు యాజమాన్యాలకు అనుమతులివ్వడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'ప్రజాగళం'లో పలువురు అభిప్రాయాలను వ్యక్తంచేశారు. -అశ్వారావుపేట

ప్రజాగళం

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి
చందు వేణుగోపాల్, పేరెంట్, నారాయణపురం




ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులుం పెరిగింది. యాజమాన్యాలే ఫీజులు నిర్ణయించి దోచుకుంటున్నాయి. ఫీజు నిర్ణయించిన తరువాతే అడ్మిషన్లు ప్రారంభించాలి

జేబులు కొల్లగొడుతున్నారు
జయవరపు సత్యనారాయణ, పేరెంట్, అశ్వారావుపేట



ప్రైవేటు పాఠశాలలు పేదల నుంచి అధిక ఫీజులు వసూలు చేసి జేబులు కొల్లగొడుతున్నాయి. విద్యాశాఖ యాజమాన్యాల కనుసన్నల్లో మిన్నకుంటుంది.

ప్రభుత్వ విద్య నిర్వీర్యానికే
హోథీరామ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి, అశ్వారావుపేట



ప్రభుత్వవిద్యను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం ద్వంద్వ విధానాలను అవలంభిస్తుంది. పేదలకు కార్పొరేట్ విద్య అంటునే.. ప్రైవేటు పాఠశాలలకు ముందే అడ్మిషన్ల అనుమతులివ్వడం దారుణం

ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది
సున్నం నాగేశ్వరరావు, ఏటీఎఫ్ రాష్ట్ర నాయకుడు



ప్రభుత్వమే కార్పొరేట్ విద్యావ్యవస్థను పెంచిపోషిస్తుందన్నది. ఫీజుల నియంత్రణ చేపట్టకుండా అనుమతులివ్వడం సరికాదు. పునరాలోచించాలి.

నియంత్రణలో ప్రభుత్వం విఫలం
బి. జోగేశ్వరశర్మ, చంద్రుగొండ



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణలో అధికారులు, ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేట్ విధానాన్ని రద్దుచేయాలి.

విద్యార్థుల పాలిట శాపం
ఏ. మంగీలాల్, అన్నపురెడ్డిపల్లి



ప్రైవేటు పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులివ్వడం విద్యార్థుల పాలిటశాపం. అధిక ఫీజులు తీసుకుంటునే.. పేదలను వేధిస్తున్నారు.

విద్యను ప్రైవేటీకరణ చేసేందుకే..
గుండపనేని ప్రసాద్, ములకలపల్లి



ప్రభుత్వం ఎన్నికల సమయంలో కేజీ నుంచి పీజీవరకు కార్పొరేట్ విద్యనందిస్తానని చెప్పింది. దానిపై చొరవ చూపకుండా, ప్రైవేటు స్కూళ్లకు నేరుగా అడ్మిషన్లు తీసుకోమని చెప్పడం సరికాదు.

అడవి హాంఫట్

- అన్యాక్రాంతమవుతున్న అటవీ భూమి
- కొందరికి వరంలా మారిన 'చట్టం'
- కొత్తగూడెం, పాల్వంచ డివిజన్లలో 8వేల హెక్టార్లు కనుమరుగు
- 1,688కేసుల నమోదు
- అడవుల ఆక్రమణకు ఎన్నో కారణాలు
- ఎన్‌జీఎస్ హెచ్చరికలతో దిద్దుబాటు చర్యలు



(ఆంధ్రజ్యోతి - కొత్తగూడెం)

అడవుల విస్తీర్ణతంలో.. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అగ్రస్థానంలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా నేడు ఆ స్థానాన్ని కోల్పోతోంది. ఒకప్పుడు పచ్చని చెట్లు, వణ్యప్రాణులతో అలరారిన అభయారణ్యాలు నేడు పోడుభూములు, మోడులతో వెలవెలబోతున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ డివిజన్లలో సుమారు 8వేల హెక్టార్ల అటవీ భూమి అన్యాక్రాంతమైందని అటవీశాఖ గణాంకాలు చెబుతుంటే వాస్తవానికి 18వేల హెక్టార్ల అటవీ భూమి పోడు భూమిగా మారింది. 2006-07నుంచి నేటివరకు 1688 కేసుల్లో 7,508మందిని బాధ్యులుగా చేశారు. 2005లో అటవీహక్కుల చట్టం కార్యరూపం దాల్చడంతో అడవుల ఆక్రమణలో అడ్డు అదుపు లేకుండా పోయింది. గిరిజనులతో పాటు అటవీ శాఖలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల సైతం 'సందట్లో సడేమియా' అన్న చందంగా వారి బంధువులు, స్నేహితులకు అటవీభూములు అప్పగించడం విశేషం. నమోదు చేసిన కేసులు సంవత్సరాల కొద్ది కోర్టుల్లో పెండింగ్ లో ఉండటం వల్ల అడవుల ఆక్రమణదారులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఒక దశలో అటవీశాఖ ఏమి చేయాలని పరిస్థితి నెలకొంది. పాల్వంచ పరిధిలోని 120 హెక్టార్ల భూమి గొత్తికోయల ఆక్రమణలో పోడు సాగులో ఉంది. దాదాపు 680 కుటుంబాలు పోడు సాగుపై ఆధారపడ్డాయి.

ఇవీ లెక్కలు...

కొత్తగూడెం నియోజకవర్గంలోని కొత్తగూడెం పరిధిలో 17,356 హెక్టార్లు, రామవరం పరిధిలో 24,107హెక్టార్లు, పాల్వంచ పరిధిలో 20,736హెక్టార్లు, చాతకొండ పరిధిలో 37,707హెక్టార్లు, యానంబైలు పరిధిలో 30,930హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. ఒకప్పటి అడవులు గణాంకాలకు భిన్నంగా ప్రస్తుతం 40శాతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లు, రహదారులు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు, పోడు భూములు కోసం ధ్వంసమయ్యాయి.

ఆక్రమణలకు ఎన్నో కారణాలు...

కర్ణుడి చావుకు ఎన్ని కారణాలున్నాయో అడవుల ఆక్రమణ, ధ్వంసం కావడానికి అన్ని కారణాలున్నాయి. శాఖల మధ్య సమన్వయ లోపమే ముఖ్య కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● 2005 అటవీ హక్కుల చట్టం పోడు రైతులకు ధైర్యాన్నిచ్చింది. ఇష్టారాజ్యంగా గ్రామాలకు సమీపంలో 3కిలోమీటర్ల నుంచి 4కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులను నరికి పోడు భూములుగా మార్చారు.

● అటవీ, రెవెన్యూ, పోలీసుశాఖల మధ్య సమన్వయ లోపం వల్ల పోడు దారులపై పెట్టిన కేసులు నీరుగారిపోవడం ఏళ్ల తరబడి కోర్టుల్లో కేసులు ఉండటంతో అడవుల ఆక్రమణ దారులకు వరంగా మారింది.

● పోడుభూముల విషయంలో రాజకీయ పార్టీలు అన్ని తమ స్వార్ధం కోసం ఆక్రమణదారులకు వత్తాసు పలకడం కొన్ని రాజకీయ పార్టీలు పోడుదార్లను ప్రోత్సహించడం విశేషం.

● అడవుల విస్తీర్ణత ఎక్కువ, ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటం, కొందరు ఉద్యోగులు పోడుదార్లకు అండగా ఉండటం వల్ల అడ వుల విస్తీర్ణం తగ్గ ముఖానికి కారణం.

● నేషనల్ జియో గ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఎన్‌జీఎస్) వారు తెలియజేసే వరకు అడవుల ఆక్రమణలు ఎంత జరిగాయో, అటవీ శాఖకు తెలియకపోవడం గమనార్హం. ఎన్‌జీఎస్ ఛాయ చిత్రాల అనంతరం రాష్ట్ర అటవీశాఖ మేల్కొని అటవీ హద్దులు చూసుకునే లోగానే అంతా జరిగిపోయింది. వెంటనే అడవుల సరిహద్దులు,ట్రెంచ్‌లు ఏర్పాటు చేయడంలో అటవీశాఖ నిమగ్నమైంది. కొత్తగూడెం పరిధిలో 35 కిలో మీటర్ల ట్రెంచ్, 20 కిలోమీటర్ల ఫైర్ లైన్స్, కిన్నెరసాని వైల్డ్ లైఫ్ పరిధిలో 28కిలోమీటర్లు ట్రెంచ్ ఏర్పాటు చేయడంలో అటవీశాఖ నిమగ్నమైంది. 2005 తర్వాత అడవుల ఆక్రమణలపై అటవీశాఖ దృష్టి పెట్టినా రాజకీయ పార్టీల జోక్యంతో ముందుకు వెళ్లలేకపోయింది. నిత్యం పోడుదార్లకు అటవీశాఖల మధ్య ఘర్షణలు జరగడం విశేషం.

జీవ సమతౌల్యానికి తూట్లు..

ఒకప్పుడు కొత్తగూడెం, పాల్వంచ వన్యప్రాణి అటవీ ప్రాంతాల్లో చిరుత పులులతోపాటు ఎలుగు బంట్లు, దుప్పులు, కనుజులు, మనుబోతులు, కుందేళ్లు వివిధ రకాల కోతులు, పక్షులు, వృక్ష జాతులకు నిలయంగా ఉండేవి. కానీ నేడు ఆ జంతువులు.. వృక్షజాతులు కనుమరుగవడంతో జీవ అసమతుల్యత ఏర్పడింది. కిన్నెరసానిలో జింకల పార్కు ఏర్పాటు చేసినా.. గతం కంటే వాటి సంఖ్య చాలా తక్కువగానే ఉందని గణాంకాలు చెబుతున్నాయి. అయితే వన్యమృగాల వేటగాళ్లపై పెట్టిన కేసుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో వేటగాళ్లకు అకృత్యాలకు హద్దు లేకుండా పోయింది. పాల్వంచ, బంగారు చెలక, రామవరం, ఉల్వనూరు, కిన్నెరసాని ప్రాంతాల్లో విలువైన జిట్రేగు, టేకు, వేగిస లాంటి వృక్షాలు కనుమరుగయ్యాయి. గ్రామాల్లోనే 'సా' మిల్లులు ఉండటం విశేషం. కొందరు అటవీ శాఖ ఉద్యోగులు వేటగాళ్లకు సహకరించడం వల్ల కొన్నికేసులు నీరుగారి పోతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. హరితహారంలో భాగంగా అటవీభూముల్లో అటవీ జాతుల మొక్కలు నాటి, పూర్వ వైభవం తీసుకురావడానికి అటవీశాఖ, రెవెన్యూ, పోలీసుశాఖల సమన్వయంతో పనిచేయాలి. దీనికి పూర్తిగా రాజకీయ పార్టీలు సహకరించాలి.

మాభూమిని మాకు అప్పగించండి





భూమి మ్యాపును పరిశీలిస్తున్న సీఐ అబ్బయ్య, ఇతర అధికారులు, గిరిజనులకు, అటవీ అధికారులకు మధ్య వాగ్వాదం

రామన్నగూడెం గిరిజనులకు, అటవీ అధికారులకు మధ్య వాగ్వాదం

అశ్వారావుపేట రూరల్, జనవరి 02: 'మాభూమిని మాకు అప్పగించాలని ఉన్నతాధికారులు 2012లోనే ఉత్తర్వులు ఇచ్చారు..అయినా మాకు మాత్రం భూమిని అప్పగించకుండా స్థానిక అటవీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని' మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు అటవీ అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. లంకాలపల్లి టేకు ప్లాంటేషన్ విషయమై రామన్నగూడెం గిరిజనులు, అటవీ అధికారులకు మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. గిరిజనులు తమ వద్ద ఉన్న ఆధారాలను ఉన్నతాధికారులకు సమర్పించగా 2012లో అప్పటి జిల్లా పాలకులు జాయింట్ సర్వేచేసి 573 ఎకరాలకు అప్పగించాలని ఆదేశాలు ఇచ్చారు. దీనిపై వివాదం అలాగే కొనసాగుతుండటంతో మంగళవారం గ్రామానికి చెందిన దాదాపు 150మంది గిరిజనులు టేకు ప్లాంటేషన్ వద్దకు వచ్చారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు అక్కడకు చేరుకున్నారు. రేంజర్ ముక్తార్ హుస్సేన్‌తో పాటు సిబ్బంది భారీఎత్తున ప్లాంటేషన్ వదకు వచ్చారు. అయితే టేకు ప్లాంటేషనన్ స్థానంలో వేరే భూమిని ఇస్తామని అధికారులు చెప్పటంతో గిరిజనులు అందుకు అంగీకరించలేదు. తమకు తమ ప్లాంటేషన్ కావాలని పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. గిరిజనులు దాదాపు 50టేకు చెట్లను నరికారు. సమాచారం అందుకున్న సీఐ అబ్బయ్య సంఘటన స్థలానికి వచ్చి గిరిజనులు, అటవీ అధికారులతో మాట్లాడారు. గిరిజనులు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపారు. దీంతో వెంటనే జాయింట్ సర్వే చేయాలని, దీనికి ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. జాయింట్ సర్వేకు గిరిజనులు ఒప్పుకుని శాంతించారు.

పాఠశాల విద్యార్థికి గాయాలు

- ద్విచక్ర వాహనం అదుపు తప్పటంతో ప్రమాదం

భద్రాచలం, జనవరి2: ఒక ఉపాధ్యాయుడి నిర్లక్ష్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని భూపాలపల్లి జయశంకర్ జిల్లా వెంకటాపురం మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాలలో వాజేడు మండలం క్రిష్ణాపురానికి చెందిన జువ్వా దిలీప్ పదోతరగతి చదువుతున్నాడు. లక్ష్మీనగరం నుంచి వెంకటాపురంకు సామాన్లు తెమ్మని అదే పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనం ఇచ్చి పంపాడు. వెంకటాపురం వెళ్లిన ఆ విద్యార్థి వెంకటాపురం నుంచి లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాలకు తిరిగి వస్తుండగా దిచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో దిలిప్ కాలువిరిగి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈవిషయం గమనించిన స్థానికులు 108 సమాచారం ఇవ్వగా వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆ ఉపాధ్యాయుడు మద్యం కోసమే తన వాహనం ఇచ్చారని, ప్రమాదం జరిగిన అనంతరం సదరు ఉపాధ్యాయుడు పరారీలో ఉన్నాడనే ఆరోపణలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- భద్రాచలం సబ్ కలెక్టరుగా పమేలా సత్పతి
- 2013 తర్వాత ఐఏఎస్‌కు బాధ్యతలు



భద్రాచలం, జనవరి 2: సుదీర్ఘ కాలం తరువాత భద్రాచలం సబ్‌కలెక్టరుగా ఐఏఎస్ అధికారిణి పమేలా సత్పతి రానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐఏఎస్‌ల బదిలీలు, నియామకాలు మంగళవారం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన నేపథ్యంలో భద్రాచలం పట్టణానికి ఐఏఎస్ అధికారిని నియమించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో ఐఏఎస్ అధికారి నారాయణ భరత్‌గుప్తా సబ్ కలెక్టరుగా బాధ్యతలు నిర్వహించిన అనంతరం తెలంగాణ ఆవిర్భవించిన తరువాత ఐఏఎస్ అధికారుల నియామకం జరగలేదు. కొంతకాలంగా ఐఏఎస్ అధికారులను నియమిస్తున్నారంటూ ఊహాగానాలు రావడం జరిగింది. అయితే అవి ఊహాగానాలకే పరిమితం అయ్యాయి. ఈ నేపథ్యంలో సుదీర్ఘ విరామం తరువాత ఐఏఎస్ అధికారి పమేలా సత్పతిని ప్రభుత్వం నియమించింది.కాగా ఇప్పటివరకు భద్రాచలం ఆర్డీవోగా బి.శివనారాయణరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తొలి నుంచి చదువుల్లో మేటి

ఒడిసా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా సునబేడాకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫీసర్ ఆర్కే సత్పతి కుమార్తె పమేలా సత్పతి చిన్ననాటి నుంచి చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సీబీఎస్ఈలో పదో తరగతి చదివిన ఆమె 92 శాతం మార్కులు, 12వ తరగతిలో 87 శాతంమార్కులు సాధించారు. చిన్ననాటి నుంచి తన తల్లే స్ఫూర్తిగా నిలిచారు. బీటెక్ కంప్యూటర్ సైన్సు చదివి ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం సంపాదించారు. అనంతరం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్)లో ఫెలో సైంటిస్టుగా పనిచేసారు. అసిస్టెంటు ప్రొఫెసర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. కవిగా, ప్రకృతి ప్రేమికురాలిగా పేరుగాంచారు.

2014 సివిల్ సర్వీసెస్‌లో 51వ ర్యాంకు


పమేలా సత్పతి సివిల్ సర్వీసెస్ రాసి 2014లో జాతీయస్థాయిలో 51వ ర్యాంకును సాధించారు. నాలుగుసార్లు సివిల్ సర్వీసెస్ రాసిన ఆమె మూడుసార్లు ఇంటర్వ్యూకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో పోస్టింగ్‌కోసం ప్రయత్నించిన క్రమంలో భద్రాచలం సబ్‌కలెక్టరుగా తొలిసారి ఐఏఎస్ అధికారి హోదాలో బాధ్యతలు చేపట్టనున్నారు. పమేలా సత్పతి భర్త దీపాంకర్ వృత్తిపరంగా వైద్యుడు. ఆమె భర్త ఇచ్చిన ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి రాగలిగారు.

ఆ.. ఇళ్లకు విద్యుత్ కట్..?

మణుగూరు రూరల్, జనవరి2: మణుగూరు మండలం రామానుజవరం పంచాయతీ సర్వే నెంబర్ 853లోని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. ఆ సర్వేలో 32ఇళ్లు ఉన్నాయి. అవి అక్రమంగా నిర్మాణమయ్యాయంటూ.. అధికారులు వాటిని తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో అక్కడ విద్యుత్ తొలగించాలని నిర్ణయించినట్టు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు.. ఆర్డీవో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం.

మీరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే అక్కడ ఓ రోబో మీ కంప్లయిట్‌ను స్వీకరించవచ్చు. షాపింగ్ మాల్‌కు వెళితే అక్కడ కూడా మీకు రోబో పోలీస్ ఎదురుకావచ్చు. ఎలా అంటారా? హైదరాబాద్‌కు చెందిన హెచ్-బోట్స్ అనే స్టార్టప్ సంస్థ రోబో పోలీస్‌ను రూపొందించింది. త్వరలోనే ఈ రోబో పోలీస్ విధుల్లో చేరే అవకాశం ఉంది.

రోబో స్పెషల్ పోలీస్



ఇప్పటి వరకు రోబోలను సినిమాల్లోనే చూశాం. ఇంట్లో పనులు చేసి పెట్టే రోబోలు విదేశాల్లో ఉన్నట్లుగా విన్నాం. కానీ ఒక రోబో పోలీస్ విధులు నిర్వర్తించడం, పబ్లిక్‌కు సహాయపడటం ఇదే మొదటిసారి. అందులోనూ ఈ రోబో తయారయింది హైదరాబాద్‌లోనే. 'హెచ్-బోట్స్' అనే స్టార్టప్ సంస్థ ఈ రోబో పోలీస్‌ను తయారు చేసింది. ఈ రోబో పోలీస్ లా అండ్ ఆర్డర్ మాత్రమే కాదు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తుంది. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) సెక్షన్లన్నీ ఈ రోబోకు తెలుసు. నైలాన్ ప్లాస్టిక్‌తో తయారుచేసిన ఈ రోబోలో ఇంకా ప్రత్యేకతలు చాలా ఉన్నాయి. మల్టీ టచ్ స్క్రీన్, అల్ట్రాసోనిక్, ప్రాక్సిమిటీ, టెంపరేచర్ సెన్సర్లున్నాయి. 24 గంటలు పనిచేసే సామర్థ్యం ఈ రోబో సొంతం. అనుమానితులను గుర్తించడం, మెటల్స్‌ను గుర్తించడం చేస్తుంది. ప్రస్తుతానికి ఇంగ్లీష్ భాషను మాత్రమే గుర్తిస్తుంది. త్వరలోనే తెలుగు, హిందీ భాషలు కూడా గుర్తించేలా చేస్తామని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు.

ఎక్కడైనా విధులకు సై!

ఈ రోబో తనకు తానుగా కదులుతుంది. ప్రజలను గుర్తిస్తుంది. ఫిర్యాదులను స్వీకరిస్తుంది. బాంబులను గుర్తిస్తుంది. ప్రజలు వేసే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది. ఇన్‌బిల్ట్‌గా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కలిగి ఉంటుందీ రోబో. మాల్స్, రైల్వే స్టేషన్లు, స్ట్రీట్స్, ఎయిర్‌పోర్టుల్లో... ఈ రోబో పోలీస్ అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇది అత్యవసర సమయాల్లో పోలీస్ సైరన్ కూడా చేస్తుంది. ఆటోమెటిక్ ఛార్జింగ్ డాక్ స్టేషన్‌ను కలిగి ఉంటుంది. ఇండోర్, అవుట్‌డోర్‌లలో ఎక్కడైనా రోబో సమర్థంగా విధులు నిర్వరిస్తుంది. 'షి'టీమ్స్‌కు సహాయపడుతుంది. రోబోకు కెమెరాలుంటాయి. కావాలనుకున్నప్పుడు లైవ్ వీడియో స్ట్రీమ్‌గా మార్చుకుని చుట్టుపక్కల పరిస్థితులను గమనించవచ్చు. ఆరు భాషల్లో మాట్లాడే సామర్థ్యం ఉంది. ఇంగ్లీష్ ఇన్‌బిల్ట్‌గా ఉంటుంది. ప్రాంతీయ భాషలు టెస్టింగ్ దశలో ఉన్నాయి. ముందుగా హైదరాబాద్‌లో ఈ రోబో పోలీస్‌ను ప్రవేశపెడతారు. తరువాత దేశంలోని అన్ని నగరాల్లో ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నారు.

రోబో ఎత్తు : 5 అడుగుల 4 అంగుళాలు
బరువు : 43 కేజీలు





పద్యం


చిత్త శుద్ధి కలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదువ కాదు
విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ వినురవేమ

భావం : మనసు పెట్టి చేస్తే ఏ చిన్న పనైనా సత్ఫలితాలనిస్తుంది. మనసు దానిమీద లేకపోతే అది ఫలించదు. మఱ్ఱిచెట్టు విత్తనము ఎంతో చిన్నది అయినా ఎంతో పెద్ద చెట్టయి విస్తరిస్తుంది. కాబట్టి ఏ పనైనా మనసారా చేయమని భావము.


నోరు తిరుగుతోందా?

If two witches would watch two watches, which witch would watch which watch?

చుక్కలు కలపండి



బొమ్మ గీయండి



జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. నార్అథ్మ ▶ ....
2. ర్నాకేదాథ్ ▶ ....
3. నాద్రీథ్బ ▶ ....
4. అథ్మనార్ ▶ ....

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. gyoa ▶ ....
2. utsolion ▶ ....
3. blpromes ▶ ....
4. eexircse ▶ ....

జవాబులు

పొడుపు కథలు : దీపం,
జంతర్‌మంతర్:
1. అమర్‌నాథ్ 2. కేదార్‌నాథ్
3. బద్రీనాథ్ 4. అమర్‌నాథ్
జంబ్లింగ్‌వర్డ్స్
1. yoga 2. solution
3. problems 4. exercise

పొడుపు కథ

ఇల్లంతా వెలుగు,
బల్లకింద చీకటి

మంచి మాట

మానసిక ప్రశాంతత ఉంటే అన్ని సంపదలూ ఉన్నట్టే!

మీకు తెలుసా?

1) శరీరంలో అతి చిన్న ఎముక చెవిలో ఉంటుంది.
2) మనిషి పాదంలో 26 ఎముకలుంటాయి.

ఒకటికి మూడు

చిత్రంలో కనిపిస్తున్న జంతువును తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!

1.ఎలుగుబంటి
2.BEAR
3. भालू



ఈ చిత్రంలో గల 5 తేడాలను కనుక్కోండి



ముక్కోటికి ఆర్టీసీ ఆదాయం రూ.11.91లక్షలు



మాట్లాడుతున్న డీవీఎం జగన్

ఖమ్మం సాంస్కృతికం/ భద్రాచలంటౌన్, జనవరి2: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గత నెల 28, 29 తేదీల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్ని భద్రాచలానికి నడిపింది. మొత్తం ఖమ్మం రీజియన్ వ్యాప్తంగా రూ.11లక్షల91వేల ఆదాయం ఆర్టీసీకి వచ్చిందని ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ జగన్ తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ముక్కోటి సందర్భంగా మొత్తం 82 ప్రత్యేక బస్సుల్ని నడిపినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి 30 ప్రత్యేక బస్సుల్ని నడపగా రూ.4లక్షల 30వేల ఆదాయం వచ్చిందన్నారు. భద్రాద్రి కొత్తగూడెంజిల్లా నుంచి 52బస్సులు నడపగా రూ.7.61లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు. గతేడాది కంటే రూ.7లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు డీవీఎం జగన్ వెల్లడించారు.

భద్రాద్రి రామయ్యకు రాపత్తు సేవ

గోవింద మండపంలో కన్నులపండువగా వేడుక

భద్రాచలం, జనవరి 2: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తు సేవల్లో భాగంగా మంగళవారం తాతగుడిలోని గోవింద మండపంలో రాపత్తు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రామాలయంలో అందంగా అలంకరించి భాజభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారిని తిరువీధి సేవ నిర్వహిస్తూ మండపంకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం గోదావరి ఒడ్డున ఉన్న పునర్వసు మండపంలో స్వామి వారికి రాపత్తుసేవ నిర్వహించనున్నారు.



రాపత్తు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నేడు భద్రాద్రి ఏరియా ఆసుపత్రికి రాష్ట్ర కాయకల్ప బృందం రాక

భద్రాచలం, జనవరి 2: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రాష్ట్ర కాయకల్ప అధికారుల బృందం బుధవారం రానుంది. డాక్టర్ అశోక్‌కుమార్ నేతృత్వంలో నలుగురు అధికారుల బృందం ఏరియా వైద్యశాలను తనిఖీచేయనున్నారు. గత ఏడాది జాతీయస్థాయిలో ఉత్తమ ఏరియా వైద్యశాలగా అవార్డుపొందిన నేపథ్యంలో భద్రాచలం వైద్యశాల మరోసారి జాతీయ స్థాయిలో అవార్డును సాధించాలనే సంకల్పంతో అధికారులు ఉన్నారు. ఇందుకోసం గత ఆరు నెలలుగా వైద్యశాలలో ఎన్నో మార్పులు, చేర్పులుచేస్తూ ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి కాయకల్ప అధికారుల బృందం పరిశీలించి నివేదిక అందజేస్తే, జాతీయస్థాయి అధికారుల బృందం తనిచేయనుంది.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా చండీ హోమం

పాల్వంచ రూరల్, జనవరి 2: మండలంలోని కేపీజగన్నాథపురం పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం చండీ హోమం జరిపారు. మేళ్ళ తాళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దేవాలయం నుంచి యాగశాలకు తీసుకువచ్చి మండపారాధన, గణపతి పూజలు జరిపారు. హోమంలో ఐదుగురు దంపతులు పాల్గొనగా దేవస్థానం తరపున ఆశీర్వచనం చేసి శేషవస్త్ర ప్రసాదం అందజేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, దేవస్థానం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, హనుమంతు పాల్గొన్నారు.

పల్స్ పోలియోని విజయవంతం చేయాలి

జిల్లా వైద్యశాఖ సర్వ్‌లైన్స్ అధికారి రమేష్

జూలూరుపాడు, జనవరి 02: ఈ నెల 28న మొదటి విడత పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యశాఖ సర్వ్‌లైన్స్ అధికారి కె.రమేష్ తెలిపారు. మంగళవారం జూలూరుపాడులోని సీహెచ్‌సీలో ఏఎన్ఎంల, ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతలో 1.12 లక్షల మంది చిన్నారులకు మొదటి విడతలో పల్స్ పోలియో చుక్కలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, చుక్కల మందును పంపిణీ చేసేందుకు జిల్లాలో 1125 వ్యాక్సిన్ కేంద్రాలు, ప్లానింగ్ యూనిట్‌లు 34, మొబైల్ కేంద్రాలు 76, రూట్‌లు 112లను ఏర్పాటు చేయడంతో పాటు, 52 ట్రాన్సిస్ట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జూలూరుపాడు మండలంలో 2469 మంది చిన్నారులకు పోలియో చుక్కలను అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైద్యులు శ్రీధర్, గీత, సీహెచ్‌వో పాపయ్య, హెల్త్ సూపర్ వైజర్‌లు అనంతరాములు, పద్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యశాఖ అధికారి రమేష్

అనుబోస్‌లో ఉల్లాసంగా అనుసంధాన్ 2-కే 18

పాల్వంచ, జనవరి2: పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో అనుసంధాన్ 2-కే 18 కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమయింది. విద్యార్థులకు 10రోజులపాటు క్రీడలు నిర్వహించి ఈనెల 11,12 తేదీల్లో నిర్వహించే వార్షిక వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేసారు. మంగళవారం విద్యాసంస్థల చైర్మెన్ తలశిల భరత్‌కృష్ణ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా బహుమతులు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో అనుబోస్ డైరెక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆవిర్భావ వేడుకల్లో అనుబోస్ యాజమాన్యం

'బర్దన్ ఆశయాలను కొనసాగిస్తాం'

పాల్వంచ టౌన్, జనవరి 2: దివంగత సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎబీ. బర్దన్ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ముత్యాల విశ్వనాథం అన్నారు. బర్దన్ రెండో వర్ధంతి సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ^నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం అలుపెరగని పోరాటం చేసిన పోరాట యోధుడు బర్దన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కార్యదర్శులు కొమ్మవరపు ఆదాం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, భాగం రాం ప్రసాద్, అన్నవరపు వెంకటేశ్వర్లు, లింగం సత్యనారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషిచేద్దాం

కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

శుభాకాంక్షలు తెలిపినఅధికారులు

కొత్తగూడెం (కలెక్టరేట్), జనవరి 2 : సమష్టి కృషితో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషిచేద్దామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. ఆంగ్ల సంవత్సర ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం ఆయనను పలువురు జిల్లా ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జేసీ రాంకిషన్, డీ ఆర్వో కిరణ్ కుమార్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కృష్ణారెడ్డి, కోశాధికారి నాగరాజు, వీరభద్రం, డీపీఆర్వో శ్రీనివాసరావు, విజయ శాంతి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జేసీ రాంకిషన్, డీఆర్వో కిరణ్‌కుమార్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధికారులు

డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడ్ల మోహన్‌రావు

పాల్వంచ టౌన్, జనవరి 2: రాష్ట్ర ముఖ్యమంత్రి డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ.2వేల పెన్షన్ ఇస్తానని రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు అమలు చేయలేదని ఆ మాటే మరిచారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడ్ల మోహన్‌రావు అన్నారు. మంగళవారం పాల్వంచ పోస్టాఫీస్ సెంటరులోని వృత్తిదారులతో నాగార్జున సాగర్‌లో జరగబోయే రాజకీయ శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికైన ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసి వీరిని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బోయిన శ్రీనివాస్,బి. రవి, కోట వెంకటేశ్వర్లు, జి. వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

'రజకుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి'

పాల్వంచ, జనవరి2: సమాజసేవకులుగా గుర్తింపు పొందిన రజకుల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ జెన్‌కో రజక ఎంప్లాయిస్ యూనియన్ కేటీపీఎస్ అధ్యక్షుడు మలిపెద్ది వెంకటసోములు ఆరోపించారు. పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకులకు తెలంగాణలో ఎటువంటి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టక రజకులు అట్టడుగుకు చేరుకునే ప్రమాదం ఉందన్నారు. హైదరాబాద్‌లో రజక సంక్షేమ భవనాన్ని ఏర్పాటు చేయాలని, వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేసారు. ట్యాంక్‌బండ్‌పై చాకలిఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెరకు అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధర్మరాజుల శ్రీను, బీవీఆర్, సోమనర్సయ్య, విజయ్, సత్తిబాబు, అయోధ్య, వెంకట్, సతీష్, సొసైటీ కార్యదర్శి నాగేశ్వరావు, రాము, మల్సూర్ పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సినిమాలు

కొత్తగూడెం

- దుర్గా: ఎంసీఏ
- పూర్ణ: ఏ పిల్లగాడ..
- పరమేశ్వరి: ఒక్కక్షణం
- విశ్వరూప: టూ కంట్రీస్
- మహేశ్వరి: హలో

పాల్వంచ

- వెంకటేశ్వర ఎంసీఏ
- వేణుగోపాల్ ఒక్క క్షణం..
- శాంతి టూ కంట్రీస్

ప్రధాన ఆసుపత్రి

సూపరింటెండెంట్
డాక్టర్ జనార్దన్ 8008553195
మంగళవారం డ్యూటీ డాక్టర్
విజయ్‌కుమార్

గ్యాస్ సమాచారం

కొత్తగూడెం ఇండియన్ గ్యాస్ గోడౌన్ నుంచి 2న గ్యాస్ బుక్ చేసుకున్న వారికి 9 న సిలిండర్ అందజేస్తారు.
గ్యాస్ ఆన్‌లైన్ బుకింగ్
9848824365

రైతు బజార్ ధరలు

కిలో, రూపాయల్లో..

టమాట - 10, పచ్చిమిర్చి- 30, వంకాయ- 20, బెండకాయ - 35, కాకరకాయ- 40, బోడ కాకరకాయ - 60, బీరకాయ- 50, దొండకాయ- 30, చిక్కుళ్లు కాయలు- 50, దోసకాయ- 25, మసాల వంకాయ- 25, సోరకాయ ఒకటి రూ. 15, పొట్లకాయ ఒక్కటి రూ. 15, క్యాబేజీ- 40, ఉల్లిగడ్డలు (రైతు బజారులో) రూ.50, గోరుచిక్కుళ్లు - 35, చామగడ్డ - 50, అలుగడ్డ- 20, క్యారెట్ - 60, క్యాప్సికమ్- 70, తెల్ల వంకాయ- 30, కంచ కాకర రూ. 50, తోటకూర- 5, కోతిమీర, పుదినా కట్టలు ఒక్కటి 10, పాలకూర కట్ట- 5, చుక్కకూరకట్ట- 5, బచ్చల కూరకట్ట- 5, అరటికాయ ఒకటి - 8త

కేటీపీఎస్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పాల్వంచ,జనవరి2: ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు నూతన సంవత్సరం సందర్భంగా ఒక ఇంక్రిమెంట్ ఇవ్వటంతో పాటు రైతులకు 24గంటల విద్యుత్ ఇవ్వటాన్ని పురస్కరించుకొని పాల్వంచలోని అధికార టీఆర్‌వీకేఎస్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. మంగళవారం కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పారిశ్రామిక రంగానికి కూడా ప్రభుత్వం నిరంతర విద్యుత్ ఇవ్వటం మూలంగా తెలంగాణ లో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని జెన్కో అధ్యక్షుడు చారుగండ్ల రమేష్ అన్నారు. జెన్కో వర్కింగ్ ప్రెసిడెంట్ డోలి శ్రీను మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎప్పుడూ శ్రామికుల పక్షానే ఉందన్నారు. ఈకార్యక్రమంలో కేటీపీఎస్ ఓఅండ్ఎం, 5,6దశల రీజియన్ కమిటీల నాయకులు మధు, కాంతయ్య, కోటేశ్వరావు, కష్ణమూర్తి, ధనయ్య, వెంకటరత్నం, ఏడుకొండల్, జేమ్స్, శ్రీను, దంచనాల రాంబాబు, నాగేశ్వరావు, అంజంరాజు, బేగ్, రవికుమార్, శేషంరాజులు పాల్గొన్నారు జిల్లా టీఆర్ఎస్ కార్మికవిభాగం ఆధ్వర్యంలో కూడా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషిచేస్తున్నారని నాయకులు డీఈ శ్రీనివాసరావు, కట్టా మల్లికార్జున్, షమీర్, సందీప్, దిలీప్, సాగర్, వెంకటేశ్వర్లు, భవానీ, వెంకట కృష్ణయ్య, రమేష్, రవి, శంకర్‌లు పాల్గొన్నారు.


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కొత్తగూడెం మైనార్టీ కాంగ్రెస్ కమిటీ రద్దు

ఖమ్మం అర్బన్ జనవరి2: కొత్తగూడెం పట్టణ కాంగ్రెస్ మైనార్టీ కమిటీని రద్దు చేసినట్లు కాంగ్రెస్ ఉమ్మడి జిల్లాల మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.. కొత్తగూడెం కమిటీ నేతలు డీసీసీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేయక పోతుండటంతో పీసీసీ ఉత్తర్వుల మేరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అనుబంధ కమిటీలు ఎప్పటికప్పుడు డీసీసీ, పీసీసీ ఆదేశాలను పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేయని కమిటీలను రద్దు చేస్తామన్నారు.

ఘనంగా ఏబీ బర్ధన్ వర్ధంతి

జూలూరుపాడు, జనవరి 02: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబి బర్ధన్ 2వ వర్ధంతి వేడుకలను సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు బర్ధన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగూల్‌మీరా, మధు, చాంద్‌పాషా, స్వరాజ్‌రావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

[redacted] అవీ..ఇవీ..

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం..



మాట్లాడుతున్న వైద్యాధికారి వినోద్

సుజాతనగర్, జనవరి 2: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి పోటు వినోద్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశావర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి వైద్య సిబ్బందికి తదనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. 0-5 పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. శ్వాసకోశ వ్యాధుల నివారణపై తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిన్న పిల్లల్లో వచ్చే దగ్గు, జలుబును నిర్లక్ష్యం వహించవద్దని, అది నిమోనియాకు దారి తీస్తుందన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యాశాఖ మంత్రికి వినతి

కొత్తగూడెం టౌన్, జనవరి 2: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. సోమవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఎమ్మెల్సీ పూల రవీందర్‌కు పీఆర్‌టీయు ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కడియం, ఎమ్మెల్సీ పూల రవీందర్‌లు సాధ్యమైనంత త్వరలోనే విద్యారంగంపై దృష్టిసారించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రభుత్వ నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు నాంది పలికేలా ఉన్నాయని కొనియాడారు.



మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేశ్వర్‌రావు

కేసీఆర్‌ది నియంత పాలన

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

కొత్తగూడెం టౌన్, జనవరి 2: అధికార అహంకారంతో నియంత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. చుంచుపల్లి మండలం గరీబ్‌పేట గ్రామ పంచాయతీ మేషన్‌కాలనీలో జరిగిన పంచాయతీ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నరేళ్ల పాలనలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోందని, అభివృద్ధి ముసుగులో అవినీతి రాజ్యమేలుతోందని విమర్శించారు. అనేక సమస్యలతో బాధపడుతున్న శ్రమజీవులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే వారిపై లాఠీచార్జీ, నిర్బంధాలకు పూనుకుంటున్నారన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన పేదలందరికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, మూడెకరాల భూమి పథకం అమలు చేయాలని, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి విజయ్, నాయకులు కంచర్ల జమలయ్య, ఎస్‌కే. పహీం ఖాన్, కొండయ్య, భాస్కర్, సత్యనారాయణ, రోజ, శ్రీనివాస్, జీవిత, మల్లయ్య, లక్ష్మి, ఎఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

'మునిసిపల్ కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నదృశ్యం

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 2: కొత్తగూడెం మునిసిపల్ కమిషనర్ సఫీ ఉల్లాపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుంపల ఓంప్రకాష్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతునకు కోరారు. మంగళవారం ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. మునిసిపల్ కార్యాలయానికి వచ్చే మహిళలపట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ పనితీరుపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మాళోతు కోటేష్ నాయక్, రేణుక యువసేన జిల్లా అధ్యక్షులు వీరబాబు, సుజాతనగర్ మండల కాంగ్రెస్ నాయకులు మధు, మాన్‌సింగ్, భార్గవ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గురునాథం

జూలూరుపాడు, జనవరి 02: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదింప చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెంగల గురునాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడులో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల పక్ష పార్టీల నాయకులను ఢిల్లీ తీసుకెళ్లాలని డిమాండ్‌తో మందా కృష్ణమాదిగ చేపట్టబోయే దీక్షలు విజయవంతం కావాలని కోరుతూ జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఉపవాస దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో గార్లపాటి రాంబాబు, కాకటి గోపి, నర్సింహారావు, నరసింహారావు, కృష్ణారావు, జి.కృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ డైరీ ఆవిష్కరణ

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 2: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయశాఖ అధికారుల సంఘం డైరీని మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపర్చి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానం తేవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులంతా నిబద్ధతతో పనిచేసి రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తూ.. ఎక్కువ దిగుబడి సాధించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రవి కుమార్, కరుణశ్రీ, ఏఓలు రఘుదీపిక, అనూష, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో వీరభద్ర విద్యార్థి ప్రతిభ

పాల్వంచ, జనవరి 2: హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ప్రాంగణంలో మూడు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్వంచలోని వీరభద్ర ఐటీఐ విద్యార్థి ప్రతిభ చాటాడు. నేపాల్, శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, భూటాన్, బైరెక్, ఇండియా తదితర దేశాలనుంచి సుమారు 1200మంది క్రీడాకారులు ఈపోటీలకు తరలిరాగా వీరభద్ర ఐటీఐ నుంచి తరలివెళ్లిన ధర్మరాజుల పవన్ బ్రాంజిమెడల్ సాధించాడు. బూడోకాన్ కరాటే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో నిర్వహించిన ఈపోటీల న్యాయనిర్ణేతగా ఆస్ట్రేలియాకు చెందిన జాతీయ కోచ్ వైనమిక్ డొనాల్డ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా కరాటే ఫెడరేషన్ అధ్యక్షులు పరమేష్ విజేతలకు బహుమతులు అందజేసారు. ఈమేరకు విద్యార్థిని వీరభద్ర ఐటీఐ ప్రిన్సిపల్ ముత్యాల ప్రవీణ్‌కుమార్ మంగళవారం అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహించటం మూలంగానే విద్యార్థి ప్రతిభ చాటాడని తెలిపారు. పవన్‌కు శిక్షణ ఇచ్చిన టీ ప్రసాద్, ప్రణీత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్

అధిక ఫీజులపై భిన్నాభిప్రాయాలు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలో ఈ ఏడాది అయిన ఫీజులు తగ్గించమన్న తల్లిదండ్రుల అభ్యర్థనను విద్యాశాఖ పట్టించు కోలేదు. పైగా ప్రతీఏటా 10శాతం ఫీజులు పెంచుకోవచ్చని కమిటీ నివేదిక ప్రకటించింది. విద్యాశాఖ విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు భగ్గుమంటున్నారు.
- పోస్టాఫీస్ సెంటరు/పాల్వంచ టౌన్

ప్రజాగళం

ఫీజులు భారమయ్యాయి..



బన్నీ విజయ్, విద్యార్థి తండ్రి

ఈ ఏడాదైన ఫీజులు రాష్ట్ర ప్రభుత్వం తగ్గిస్తుందని కోటి ఆశలతో ఎదురుచూశాను. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, చదువులు భారమవుతున్నాయి. ఇంట్లో పిల్లలను చదివించుకోవాలంటే ఆర్థికంగా పెనుసవాల్‌ను ఎదుర్కోవల్సి వస్తోంది.

అధిక ఫీజులతో ఇబ్బంది..



చంద్రకళ, కొత్తగూడెం

అధికఫీజులతో ఆర్థికంగా ఇబ్బందిగా ఉన్న తప్పక చదివించాల్సి వస్తుంది. ప్రభుత్వం, విద్యాశాఖ సామాన్యులపై దృష్టి పెట్టాలని, ఫీజులను తగ్గించాలని కోరుతున్నాం.

విద్యా ప్రమాణాలు కనుమరుగయ్యాయి..



అమృతరావు, కొత్తగూడెం

విద్యా ప్రమాణాలు ఇప్పుడున్న పరిస్థితుల్లో కనుమరుగయ్యాయి. విద్యాశాఖ ప్రణాళికలు చాలా ఇబ్బందిగా తల్లిదండ్రులకు, విద్యార్థులకు కష్టంగామారింది. చదువులు ఎల కొనసాగుతాయో భయంగా ఉంది.

ఫీజులు కట్టలేకపోతున్నాం..



సీతామహాలక్ష్మి, విద్యార్థిని తల్లి,

ప్రైవేట్ పాఠశాలలో ఇప్పటికే ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఉన్నాం. అయినా ప్రభుత్వం ఫీజులు పెంచుకోవచ్చనే సంకేతాలు ఇవ్వడం సామాన్యులకు పిడుగులాంటి వార్తే. ఉన్న ఫీజులను తగ్గిస్తామని ఎదురుచూస్తున్న తరుణంలో ఇలా ఫీజులు పెంచుకోవచ్చనే వార్త సామాన్యులకు భారమే.

కమిటీ నివేధికను రద్దు చేయాలి



జహంగీర్‌షరీఫ్ (ఉపాధ్యాయుడు,)

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం నియమించిన తిరుపతిరావు కమిటీని రద్దు చేయాలి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను అదుపు చేయకుండా ప్రతీ ఏట 10 శాతం ఫీజులను పెంచుకోవచ్చని కమిటీ సూచించడం దుర్మార్గం. ఇప్పటికైన ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించే విధంగా చర్యలు చేపట్టాలి.

పేదలకు దుస్తుల పంపిణీ

జూలూరుపాడు, జనవరి 02: క్రీస్తు ఆదరణ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. జూలూరుపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన 15 మంది పేదలకు మండల పాస్టర్ ఫెలో షిప్ అధ్యక్షుడు రాంచంద్రపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సమూయేల్‌రాజ్, ఉపాధ్యక్షులు జైపాల్, యేహెజ్కేల్, దానియేలు, ఆనందరావు, సెయింట్‌పాల్, లక్ష్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు

సీపీఎం జిల్లా సభలకు తరలిన నాయకులు

ఇల్లెందుటౌన్,జనవరి2: భద్రాచలంలో మూడురోజుల పాటు జరుగనున్న సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలకు ఇల్లెందునుంచి నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలి పోయారు. నాయకులు మాట్లాడుతూ సభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్‌నబీ, తాళ్ళూరి కృష్ణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పూజారులకు చేయూత

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- ఏజెన్సీలో విస్తృత పర్యటన
- బయ్యారం పెద్దచెరువును పర్యాటక కేంద్రం చేస్తామని వెల్లడి



బయ్యారం పెద్ద చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్,జనవరి2: గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో పూజలు చేస్తున్న పూజారులకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అమర్‌సింగ్‌తండాలో జరిగిన బహుజన పూజారుల పోరాట సమితి నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి దేవతలను ఆరాధించే పూజారులకు, శివసత్తులకు, దేవదమ్మలను సైతం ప్రభుత్వం గుర్తించే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పురాతన దేవాలయాలకు, పూజారులకు సైతం ప్రభుత్వం నెలవారి వేతనాలు, ధూపదీప నైవేద్యాలకు ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాబురావు, కార్యదర్శి వాసం విజయ్‌కుమారి, రమేష్‌రాథోడ్, గంగమ్మ, జంపయ్య, రమణమ్మ, రామక్క, ఆంజనేయులు, శారద, రవి, సీతారాం, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొమరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.



దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉద్యోగం కల్పించేందుకు కృషిచేస్తా..

పోచారంతండాలో పేద వికలాంగ కుటుంబమైన వాంకుడోత్ జగన్ ఇంటికి వెళ్లి కుటుంబ ఆర్థిక పరిస్థితిలను అడిగి తెలుసుకున్నారు. జగన్ కుమారుడు, కుమార్తెలు ఇరువురు వికలాంగులే కావడంతో ఎమ్మెల్యే కోరం కనకయ్య చలించిపోయారు. పెద్ద కుమారుడు ఇంజనీరింగ్, కుమార్తె ఉషారాణి డిగ్రీ పూర్తిచేయగా మరో కుమార్తె సరిత 10వ తరగతి చదువుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే తండ్రి జగన్‌ను అభినందించారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పర్యాటక కేంద్రంగా బయ్యారం పెద్దచెరువు

ఇల్లెందు,జనవరి2: వ్యవసాయాభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. మంగళవారం ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం పెద్దచెరువు నుంచి 2వ పంటకు(తైబంది) సాగునీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం చెరువు అటవీ ప్రాంతంలో ఆహ్లాదాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ జయశ్రీ, వైస్ ఎంపీపీ మూలమధుకర్‌రెడ్డి, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ భూక్య నాగేశ్వర్‌రావు తహసీల్దార్ రామకృష్ణ, రైతు కమిటీల ప్రతినిధులు చల్లగుండ్ల గోవయ్య, కొండ్రెడ్డి సోమిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యావిధానాన్ని..
నిర్వీర్యం చేసేందుకే నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీచేసిన జీవోతో ప్రభుత్వవిద్య నిర్వీర్యమైతుందని పలువురు అభిప్రాయపడ్డారు. జనవరి 2 నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవొచ్చని ప్రభుత్వం జీవో జారీచేయడంపై మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రజాగళం నిర్వహించింది. ఈవిధానంతో ప్రైవేటు విద్యాసంస్థలకే లాభమని ఆగ్రహం వ్యక్తంచేశారు. - ఇల్లెందు

ఆంధ్రజ్యోతి ప్రజాగళం

సర్కారు విద్యపై సవతి ప్రేమ



జీ. బాలునాయక్, టీపీటీఎఫ్ నేత

ప్రభుత్వం అడ్మీషన్లను ముందే తీసుకోవాలని ప్రైవేటు యాజమాన్యాలకు ఆదేశాలు జారీచేయడం సరికాదు. సర్కార్ విద్యపై సవతితల్లి ప్రేమ చూపిస్తుంది. అందరికీ ఒకే విద్యావిధానం అమలు చేయకుండా ప్రభుత్వం పేదలను మోసం చేస్తుంది.

విద్యకు దూరంగా పేదలు



గుడివాడ నరేందర్(పేరెంట్)

పేద విద్యార్థులకు ప్రభుత్వం విద్యను దూరంచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. విద్యను నిర్వీర్యం చేసి ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఈ విధానాన్ని పునరాలోచించాలి.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



జీ. నరేష్ (పేరెంట్)

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను మరింతగా ఏర్పాటుచేస్తే పేదలకు మేలు జరుగుతుంది.

ప్రభుత్వ విధానం సరైనదే




వీ.సుధాకర్

ప్రైవేట్ పాఠశాల యజమాని

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదే. నాణ్యమైన విద్యను అందించేందుకు మరింతగా ప్రైవేటు పాఠశాలలను ప్రోత్సహించాలి. ప్రభుత్వ విధానాల కణుగుణంగా యాజమాన్యాలు నడుచుకుంటాయి.

ముందస్తు అడ్మీషన్లు సరికాదు



ఎండీ. ఆహద్(పేరెంట్)

ముందస్తుగా అడ్మీషన్లు ఇవ్వాలని ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. ప్రభుత్వం స్పష్టమైన విధానం అమలు చేయాలి. సంవత్సరానికో విధంగా విద్యావిధానం మార్పులు చేయడంతో పేద ప్రజలు మోసపోతారు.

ప్రైవేటుకే లాభం..



ఎస్‌కే. ఖాదర్(పేరెంట్)

ప్రైవేటు యాజమాన్యాలకే ప్రభుత్వం బంగారుమయం చేస్తుంది. ముందస్తు అడ్మీషన్ల జీవో కార్పొరేట్ కనుసన్నల్లోనే ప్రభుత్వం తయారుచేసింది. సర్కార్ పాఠశాలలకు వసతులు కల్పించాల్సింది పోయి.. ప్రైవేటుపై ప్రేమ చూపించడం దారుణం. ప్రభుత్వం పునరాలోచించాలి.

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి: టీపీటీఎఫ్

టేకులపల్లి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమీషన్‌ను నియమించాలని, పండింట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రమోషన్లు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బ్రహ్మచారి డిమాండ్ చేశారు. టేకులపల్లిలో మంగళవారం జరిగిన టీపీటీఎఫ్ మండల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ, గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్, కార్యవర్గ సభ్యులు రామ్మూర్తి, వి.రాములు, మౌలానా, రమణ, దామోదర్‌రావు, వెంకటేశ్వర్లు, రామరాజు, రాంకిషన్, భాస్కర్‌రావు, లక్ష్మా, సుమంత్‌శ్రీనివాస్, కనకరాజు, నెహ్రూ, ముత్తయ్య పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన వారికి జరిమానా

ఇల్లెందురూరల్, జనవరి2: అక్రమంగా గుడుంబా తయారుచేస్తూ విక్రయాలు చేపడుతున్న పలువురిపై కేసులు నమోదుచేసి జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ వేమరాజశేఖర్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో గతంలో బైండోవర్ కేసులై ఉల్లంఘనలకు పాల్పడిన నెహ్రూనగర్‌కి చెందిన బానోత్ దేవ, జ్యోతిలకు రూ.20వేలు జరిమానా విధించినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా, నాటుసారా కాసిన, తయారుచేసినవారిపై పీడీయాక్ట్ నమోదుచేస్తామని హెచ్చరించారు.

పోలారంలో వైద్యశిబిరం

ఇల్లెందురూరల్, జనవరి2: జిల్లా వైద్యఆరోగ్యశాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో మంగళవారం పోలారంలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వాంకుడోత్ సరోజని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపట్ల వైద్యసిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మర్రిగూడ సర్పంచ్ కాంతారావు, ఎంపీటీసీ పాయం పొట్టయ్య, వైద్యులు కోటేశ్వరరావు, జాయిస్, సంధ్య, మురళి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ కిట్లు అందజేత

ఇల్లెందురూరల్,జనవరి2: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని 21 ఫిట్ ఏరియాలో యువకులకు క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ రైతు విభాగం కన్వీనర్ చీమల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో వైఫల్యం చెందిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్‌కే. జానీ, పోశం వెంకటేశ్వర్లు, హరికృష్ణ, లక్ష్మీనారాయణ, కాయం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేదిలేదు: టీఆర్ఎస్వీ

ఇల్లెందురూరల్,జనవరి2: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శిస్తే సహించేదిలేదని వారికి తగిన గుణపాఠం తప్పదని టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు పడిదల నవీన్, నియోజకవర్గ ఇన్‌చార్జీ మెరుగు కార్తీక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలు ఇవ్వడంలేదని బస్సుయాత్ర పేరుతో టీజేఏసీ ప్రభుత్వాన్ని విమర్శించేందుకే ప్రతిపక్షాలు తిరుగుతున్నారని ఆరోపించారు.

బయోమెట్రిక్‌ను ప్రారంభించిన తహసీల్దార్

టేకులపల్లి, జనవరి2: అర్హులైన రేషన్ కార్డుదారులకు బయోమెట్రిక్ ద్వారా నిత్యవసర వస్తువులు అందించాలని తహసీల్దార్ అంజంరాజు సూచించారు. రేషన్ దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేసిన బయోమెట్రిక్ యంత్రాన్ని మంగళవారం మండలంలోని బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండా దుకాణంలో తహసీల్దార్ ప్రారంభించారు. ఈపాస్, ఎలక్ట్రానిక్ కాటాలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ బయోమెట్రిక్ విధానంతో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఊకే శేఖర్‌రావు, మండల డీలర్లు హేమచందర్, రామా, శ్రీరాములు, సంతూలాల్, బాలు తదితరులు పాల్గొన్నారు.



బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ అంజంరాజు

సీఐ వాహనానికి త్రుటిలో తప్పిన ప్రమాదం

ఇల్లెందుటౌన్,జనవరి2: సీఐ వాహనానికి త్రుటిలో ప్రమాదం తప్పినట్లయింది. టేకులపల్లి సీఐ దోమల రమేష్ మంగళవారం ఇల్లెందుకు తన వాహనంలో వచ్చి తిరిగి వెలుతుండంగా పట్టణంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో అకస్మాత్తుగా ముందు టైర్ పేలిపోయింది. డ్రైవర్ వెంటనే బ్రేక్ వేయగా.. వెనుక నుంచి వస్తున్న రెండు ఆటోలు వాహనాన్ని ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఏమీకాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.